


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక :55 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : శ్రీకాకుళం సోమవారం 9 మార్చి 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 55 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : SRIKAKULAM MON 9 MARCH 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, Chittor, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur

## మహిళాభివృద్ధి కోసం 'స్వయం' బ్రాండ్...

# నేనే అంబాసిడర్‌గా ఉంటా

- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- అమరావతిలో కార్యక్రమం
- ముఖ్య అతిథిగా హాజరైన సీఎం చంద్రబాబు
- ప్రధాని మోదీ, పవన్ కల్యాణ్‌తో కలిసి మహిళల అభ్యున్నతికి కృషి చేస్తామని ప్రకటన
- డ్వాక్రా సంఘాలకు పూర్వ వైభవం తీసుకువస్తామని హామీ



**పెన్ పవర్ డెస్క్:**అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అమరావతిలోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. సభకు భారీగా తరలివచ్చిన మహిళలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. తాను, ప్రధాని నరేంద్ర మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముగ్గురం కలిసి మహిళల అభ్యున్నతికి, వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. సృష్టికి మూలం మహిళ అని, ప్రేమ, త్యాగం, కష్టానికి వారు ప్రతిరూపమని కొనియాడారు. తెలుగింటి ఆడబిడ్డలకు, దేశంలోని మహిళలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

సీఎంగానే కాకుండా ఒక అన్నగా, తండ్రిగా ఆడబిడ్డలను ప్రోత్సహించి ఉన్నత స్థానాలకు తీసుకురావడానికి తన సర్వశక్తులూ ఒడ్డుతానని చంద్రబాబు హామీ ఇచ్చారు. 2019-24 మధ్య కాలంలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని, దానివల్ల తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తాను, మోదీ, పవన్ కల్యాణ్ కలిసి పేదలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని, డ్వాక్రా, మెప్మా సంఘాలకు పూర్వ వైభవం తీసుకురావడమే తమ ఆలోచన అని పునరుద్ఘాటించారు. మహిళలకు న్యాయం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆయన అన్నారు."మా ఆడబిడ్డలు తయారుచేసే వస్తువులకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో 'స్వయం' బ్రాండ్‌ను ప్రారంభించాం. ఈ బ్రాండ్‌కు నేనే బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటాను. నాణ్యత, ప్యాకేజింగ్, టెక్నాలజీ వంటి అంశాల్లో ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 84 లక్షల మందికి పైగా డ్వాక్రా సభ్యులున్నారు. వారందరినీ ఆర్థికంగా ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే మా సంకల్పం" అని వివరించారు.

ఇప్పటికే లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలు ఉన్నారని, రాబోయే ఏడాదిలో మరో 5 లక్షల మందిని చేర్చి మొత్తం 6 లక్షల మందితో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు. మహిళలు తయారు చేసే వస్తువులను వారే వినియోగించుకుంటే దాదాపు మూడున్నర కోట్ల మంది వినియోగదారులు ఏర్పడతారని, ఇది మార్కెటింగ్‌కు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు.

ఈ సందర్భంగా ఆయన పలువురు మహిళా ప్రముఖులను ప్రశంసించారు. దేశానికి రాష్ట్రపతిగా గిరిజన మహిళ ద్రౌపది ముర్ము, ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ సమర్థవంతంగా పనిచేస్తున్నారని అన్నారు. వచ్చిన ఆదాయాన్ని సమర్థంగా వినియోగించి కుటుంబాన్ని నడిపే మహిళలే నిజమైన ఆర్థిక మంత్రులని చంద్రబాబు అభివర్ణించారు. త్వరలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు కూడా ప్రధాన న్యాయమూర్తిగా ఒక మహిళ రాబోతున్నారని తెలపడం సంతోషంగా ఉందన్నారు.

దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను గుర్తుచేసుకుంటూ, ఆడబిడ్డలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించి చట్టం చేసిన ఘనత ఆయనదేనని చంద్రబాబు అన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టింది,

మిగతా 2లో




## ఇళ్లలోంచి బయటికి రావొద్దు...

### ఇరాన్ ప్రజలకు అమెరికా హెచ్చరిక

- జనావాసాల మధ్య నుంచే క్షిపణుల ప్రయోగిస్తున్న ఇరాన్ సైన్యం
- ఇళ్ల నుంచి బయటకు రావొద్దంటూ ఇరాన్ పౌరులకు అమెరికా సూచన
- పౌరులను ఇరాన్ ప్రభుత్వం ప్రమాదంలోకి నెడుతోందని ఆరోపణ
- ఇప్పటికే స్వదేశానికి చేరిన 32 వేల మంది అమెరికన్లు
- సైనిక చర్యలు జరిగే చోట భద్రతకు గ్యారంటీ లేదన్న అమెరికా

మిగతా 2లో



## చంద్రబాబు సమక్షంలో సెర్ప్, మెప్మా 36 కీలక ఒప్పందాలు

- వేర్వేరు సంస్థలతో మెప్మా, సెర్ప్ ఒప్పందాలు
- నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీతో ఒప్పందం
- చంద్రబాబు సమక్షంలో 36 కీలక ఒప్పందాలు

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో వేర్వేరు సంస్థలతో పట్టణ ప్రాంతాల పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) పలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. సముద్రపు నాచుతో ఉత్పత్తుల తయారీకి 500 మంది మహిళలకు శిక్షణ ఇచ్చేలా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీతో ఒప్పందం కుదిరింది.రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించే దిశగా వివిధ సంస్థలతో సెర్ప్, మెప్మా ఒప్పందాలు చేసుకున్నాయి. చంద్రబాబునాయుడు సమక్షంలో 36 కీలక ఒప్పందాలు చేసుకున్నాయి.

**కుదిరిన ఒప్పందాలు ఇవీ**

పట్టణ ప్రాంతాల్లో 260 ఎగ్ కార్ట్స్ సహా మహిళలతో మైక్రో ఎంటర్ ప్రైజెస్ ఏర్పాటు

మిగతా 2లో



## కాంగ్రెస్ నిర్ణయంతో ఇరాన్‌తో భారత్ సంబంధాలు దెబ్బతిన్నాయి

- అటామిక్ ఎనర్జీ ఏజెన్సీలో ఇరాన్‌కు వ్యతిరేకంగా నాటి యూపీఏ ఓటు వేసిందన్న రామచందర్ రావు
- యూపీఏ ఆరోజు తీసుకున్న నిర్ణయం ఇరుదేశాల మధ్య సంబంధాలను దెబ్బతీసిందని ఆగ్రహం
- గ్యాస్ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టీకరణ
- ఇంధనం, గ్యాస్ నిల్వలు మన వద్ద ఉన్నాయని వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:**2005లో యూపీఏ ప్రభుత్వం ఇంటర్నేష నల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీలో ఇరాన్‌కు వ్యతిరేకంగా ఓటు వేసిందని, దీనితో 2012లో మనకు ఇరాన్ ఆయిల్ సరఫరా నిలిపివేసింది

మిగతా 2లో

## శ్రీలంక తీరంలో ఇరాన్ యుద్ధనౌకపై దాడి...

# అమెరికా ముందే హెచ్చరించిందా?

- వెంటనే నౌకను వదిలిపెట్టి వెళ్లాలని అమెరికా హెచ్చరించినట్లు వార్తలు
- నౌకలోని ఓ సిబ్బంది తన తండ్రికి ఫోన్ చేసి వెల్లడించడంతో వెలుగులోకి..
- కమాండర్ ఆదేశాలను ధిక్కరించి లైఫ్ బోట్లను ఆశ్రయించిన కొంతమంది నావికులు

శ్రీలంక దక్షిణ తీరంలో ఇరాన్ యుద్ధ నౌక ఐరిస్ దేనాపై దాడికి ముందు అమెరికా హెచ్చరికలు జారీ చేసిందా? అంటే అవుననే అంటున్నారు. గత నెలలో విశాఖపట్నంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూకు వచ్చిన ఇరాన్ యుద్ధ నౌక తిరిగి వెళుతున్న సమయంలో అమెరికా జలాంతర్గామి దాడి చేసి ముంచివేసింది. అయితే దాడికి ముందు నౌకలోని సిబ్బందిని అమెరికా హెచ్చరించినట్లు తెలుస్తోంది.

మిగతా 2లో





## న్యూయార్క్ మేయర్ మమ్దానీ ఇంటి వద్ద బాంబుల కలకలం...

# ఆరుగురి అరెస్ట్

- న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీ ఇంటి వద్ద ఉద్రిక్త వాతావరణం
- నిరసనల్లో స్క్రూలు, బోల్టులతో నింపిన పేలుడు పదార్థాల వినియోగం
- మమ్దానీ ఇంటిపై దాడికి యత్నం.. ఆరుగురు ఆందోళనకారుల అరెస్ట్
- ఆందోళన సమయానికి ఇంట్లో లేని మేయర్ దంపతులు
- ఘటనను ఇస్లామోఫోబిక్ చర్యగా ఖండించిన మేయర్ కార్యాలయం

మిగతా 2లో



## నారీశక్తి వట్టిమాటే... మోదీ, చంద్రబాబుపై షర్మిల ఫైర్

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలను మోసం చేశాయన్న షర్మిల
- సూపర్ సిక్స్ హామీలతో చంద్రబాబు నయవంచనకు పాల్పడ్డారని ఆరోపణ
- మహాశక్తి, తల్లికి వందనం పథకాలతో లక్షల మందికి అన్యాయం జరిగిందని విమర్శ
- దేశంలో మహిళలకు భద్రత కరువైందంటూ కేంద్ర ప్రభుత్వంపై ఫైర్
- గ్యాస్, విద్యుత్ ఛార్జీల భారంతో ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ధ్వజం

మిగతా 2లో

## జేడీయూలో అధికారికంగా చేరిన నితీశ్ కుమార్ తనయుడు

- పాట్నాలోని పార్టీ కార్యాలయంలో నిశాంత్ కుమార్ ను ఘనంగా ఆహ్వానించిన సీనియర్ నేతలు
- తండ్రి మార్గదర్శకత్వంలోనే బీహార్ అభివృద్ధికి పనిచేస్తానని నిశాంత్ వెల్లడి
- త్వరలో చంపారన్ నుంచి రాజకీయ పర్యటనలు ప్రారంభించే అవకాశం

మిగతా 2లో



## ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరిని ఈ సంఘటన కలిచివేసింది



- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పట్ల బెంగాల్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్న మాధవ్
- సంతాల్ కాన్ఫరెన్స్‌లో సరైన ప్రోటోకాల్ పాటించలేదని ఆవేదన
- రాజ్యాంగ పదవిని గౌరవించలేదంటూ టీఎంసీపై మండిపాటు
- గిరిజన బిడ్డను అవమానించడం దేశానికే అవమానమని వ్యాఖ్య
- పశ్చిమ బెంగాల్‌లో అరాచక పాలన సాగుతోందని ఆగ్రహం

మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# చంద్రబాబు సమక్షంలో సెర్ప్, మెప్మా 36 కీలక ఒప్పందాలు

కోసం నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీతో ఒప్పందం చేసుకున్న మెప్మా.

ఎస్‌హెచ్‌జీ సంఘాల మహిళలు తీసుకునే రుణాలపై డేటా డ్రివెన్ క్రెడిట్ అసెస్మెంట్ మోడల్స్ తయారీ కోసం ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌తో ఒప్పందం.

- మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల మార్కెటింగ్, ఆధునిక రీటైల్ కియోస్కల ఏర్పాటు కోసం రీకనెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం.
- మహిళా మైక్రో ఎంటర్ ప్రైజెస్‌లకు ఆహారపదార్థాల కోసం యంత్రపరికరాలను అందించేందుకు కూలెక్స్ ఇండస్ట్రీస్‌తో ఒప్పందం.
- స్వయం ఏపీ ఎంటర్ ప్రైజ్ ఏర్పాటు, మార్కెటింగ్ లింకేజ్ కోసం నిర్మాణ్ ఆర్గనైజేషన్‌తో కుదిరిన ఒప్పందం.
- అరకు కాఫీ, చాయ్ రాస్తా లాంటి అవుట్ లెట్స్ ఏర్పాటు కోసం ఎస్‌హెచ్ జీ మహిళలకు ఆర్థిక సహకారం కోసం సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ఒప్పందం.
- ఎస్‌హెచ్ జీ మహిళల కుటుంబాల ఇళ్లనిర్మాణానికి ఆర్థిక సహకారం అందించేలా ఈజీ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం.
- తిరుపతి క్యాంటీన్ల నిర్వహణ కోసం స్వయం సహాయ సంఘాల మహిళలకు ఆర్థిక సహాకారం అందించేలా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకుతో ఒప్పందం.
- మిల్లెట్లతో తయారైన పదార్థాల రీటైల్ అవుట్ లెట్‌ల ఏర్పాటు కోసం 9 నట్జ్ మిల్లెట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం.
- మహిళా సంఘాలు ఎంఎస్ఎంఈలను ఏర్పాటు చేసుకునేలా డిజిటల్ డీపీఆర్‌లు సిద్ధం చేసుకునేలా సహకారం కోసం ఫిన్ వోయిస్ ఓపెన్ బిజినెస్ సొల్యూషన్స్‌తో ఒప్పందం.
- సౌందర్య ఉత్పత్తుల్లో వినియోగించే సముద్రపు నాచు సాగులో స్వయం సహాయ సంఘాల మహిళలకు శిక్షణ ఇచ్చేలా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీతో ఒప్పందం.
- సీవీడ్ కల్చర్‌లో మహిళలకు శిక్షణ, ఉత్పత్తుల తయారీ కోసం సీఎస్ఐఆర్‌తోనూ కీలకమైన ఒప్పందం చేసుకున్న సెర్ప్.
- ఎస్‌హెచ్‌జీ మహిళలకు సీవీడ్ ఉత్పత్తులు, విలువ జోడింపు, శిక్షణ కోసం కేరళకు చెందిన అమృత విశ్వ విద్యాపీఠంతో ఒప్పందం చేసుకున్న సెర్ప్.
- వెలుగు 2.0 ద్వారా ఎస్‌హెచ్‌జీ పారిశ్రామిక వేత్తలను బలోపేతం చేసేలా శిక్షణ, ప్రొఫైలింగ్, మార్కెట్ స్కేల్ అప్ కోసం ఎక్స్ఎల్ఆర్ఐ సంస్థతో ఒప్పందం.
- పొదుపు చేసిన మొత్తాలను వ్యాపారాలుగా మార్చేందుకు అవసరమైన సహకారం కోసం ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌తో సెర్ప్ ఒప్పందం.
- సర్క్యులర్ ఎకానమీ మోడల్ ద్వారా చేనేత వస్త్రాల జాబ్ వర్క్‌ను విలువ ఆధారిత ఉత్పత్తులు, మార్కెటింగ్ అంశాల్లో ఆప్కో మాజిక్ వీవ్స్‌తో ఒప్పందం.
- మహిళా ఎఫ్‌పీఓల బలోపేతం, మార్కెట్ లింకేజి, సహా వివిధ అంశాలపై సహకారం కోసం ఐఐఎం విశాఖపట్నంతో ఒప్పందం చేసుకున్న సెర్ప్.
- దేశీయ పౌల్ట్రీ ఉత్పత్తులు, ప్రకృతి సేద్యం ల్యాండ్ స్కేప్ లాంటి అంశాల్లో సహకారం కోసం వాసన్‌తో ఒప్పందం.
- లైవ్ స్టాక్ వ్యాల్యూ చైన్స్, ఎఫ్‌పీఓలకు సాంకేతిక మద్దతు అందించేందుకు హైఫెర్ ఇంటర్నేషనల్‌తో కుదిరిన ఒప్పందం.
- ఎఫ్‌పీఓ సర్టిఫికేషన్, గిరిజన ప్రాంతాల్లో మహిళలకు జీవనోపాధి కల్పించే అంశాలకు మద్దతు ఇచ్చేలా విజయవాహిని ఛారిటబుల్ ఫౌండేషన్‌తో ఒప్పందం.
- మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ సహా , క్రెడిట్ రెడీనెస్ కోసం కాల్గుడి డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం.
- మహిళా ఎఫ్‌పీఓలకు ప్రోత్సాహం, ఉత్తరాంధ్రలోని గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి కోసం బాపూజీ రూరల్ ఎన్ లైట్మెంట్ డెవలప్మెంట్ సొసైటీతో ఒప్పందం.
- మహిళా రైతులు, ఎఫ్‌పీఓలుకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సలహాలను ఇచ్చేందుకు డిజిటల్ గ్రీన్ ట్రస్ట్‌తో ఒప్పందం చేసుకున్న సెర్ప్.
- స్వయం సహాయ మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులకు ఫుడ్ సేఫ్టీ ఆడిట్స్, కెపాసిటీ బిల్డింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ అంశాల్లో హకారం కోసం ఫుడ్ సేఫ్టీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తో ఒప్పందం.
- ఎస్‌హెచ్‌జీల ఆధ్వర్యంలో నడిచే చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సహకారం హ్యాండ్లూమ్ క్లస్టర్ డెవలప్మెంట్ కోసం ఇండియన్ ఎంపోరియంతో ఒప్పందం.
- మహిళా సంఘాల సంస్థలు ఉత్పత్తి చేసిన హ్యాండ్లూమ్ వస్త్రాల ఎగుమతి, మార్కెటింగ్ లింకేజ్ కోసం ఎంబ్యోమ్ కన్సల్టింగ్ సర్వీసెస్‌తో ఒప్పందం.
- మిల్లెట్ క్లస్టర్ల అభివృద్ధి, బ్రాండింగ్ లాంటి అంశాల్లో యాక్సెస్ లైవ్లీ హుడ్స్ కన్సల్టింగ్ ఇండియా లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకున్న సెర్ప్.
- ఎస్‌హెచ్‌జీ సంస్థలు ఉత్పత్తి చేసిన సుగంధ ద్రవ్యాలు, పచ్చళ్ల తయారీ ఇతర ప్రాసెసింగ్ కోసం నిఎంఎస్ఎంఈతో ఒప్పందం.
- స్వయం సహాయ మహిళా సంఘాలకు గ్రామీణ సంస్థల ఏర్పాటు , స్కిల్ డెవలప్మెంట్ లాంటి అంశాల కోసం సెంచూరియన్ యూనివర్సిటి ఆఫ్ టెక్నాలజీ మేనేజ్మెంట్ తో ఒప్పందం చేసుకున్న మెప్మా.
- 800కు పైగా ఎస్‌హెచ్‌జీలు చాయ్ రస్తా, కాఫీ అవుట్ లెట్‌లను ఏర్పాటు చేసి నిర్వహించేందుకు వీలుగా చాయ్ రాస్తా ఆస్పిరేషనల్ ఫుడ్స్ లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకున్న మెప్మా.
- 20 వేల తిరుపతి క్యాంటీన్ అవుట్ లెట్స్‌ను స్వయం సహాయ సంఘాల మహిళలు ఏర్పాటు చేసేలా సారా ప్రాజెక్ట్స్- తిరుపతి క్యాంటీన్స్ సంస్థతో ఒప్పందం.
- కమ్యూటీ హెల్త్ ప్రొఫైలింగ్, ఎస్ హెచ్ జీ మహిళల కుటుంబాలకు హెల్త్ స్క్రీనింగ్ కోసం స్వస్తి ది హెల్త్ కేటలిస్ట్ సంస్థతో ఒప్పందం.
- మొబైల్ డెసెర్ట్ తయారీ ఈవీ వాహనాల నిర్వహణ కోసం ద థిక్ షేక్ ఫ్యాక్టరీ లిమిటెడ్‌తో ఒప్పందం.
- గ్రామీణ మహిళా పారిశ్రామిక వేత్తలు తయారు చేసిన ఉత్పత్తులను స్వయం డిజిటల్ స్టోర్ ఫ్రంట్ ద్వారా మార్కెటింగ్ చేసుకునేందుకు సహకారం అందించేలా ఫ్లిప్ కార్ట్‌తో ఒప్పందం.
- ఎస్‌హెచ్ జీ క్లస్టర్ డెవలప్మెంట్, శిక్షణ, పరిశ్రమలకు ప్రోత్సాహం తదితర అంశాల్లో సాయం అందించేలా ఎంటర్ ప్రెన్యూర్ షిప్ డెవలప్మెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా తో ఒప్పందం.
- వస్త్రాల తయారీ, శిక్షణ, అరకు కాఫీ ఆన్ వీల్స్ లాంటి వాటిలో సహకారం కోసం ఏపి ఐటీసీఓ సంస్థతో ఒప్పందం.
- స్వయం సహాయ సంఘాల్లోని మహిళల ఆర్థిక స్వావలంబన, శిక్షణ, సహకారం కోసం మొత్తం 36 సంస్థలతో మెప్మా, సెర్ప్ ఒప్పందాలు.
- ఆర్థిక, వ్యవసాయ, సీవీడ్, హ్యాండ్లూమ్, ఫుడ్ సర్వీస్, హెల్త్, డిజిటల్, ఎంఎస్ఎంఈ, నైపుణ్య కల్పన తదితర రంగాల్లో కుదిరిన ఒప్పందాలు.
- వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ ప్రెన్యూర్ కార్యక్రమంలో భాగంగా మహిళా పారిశ్రామిక వేత్తలను తయారు చేసేలా వివిధ సంస్థలతో ఒప్పందాలు చేసుకున్న ప్రభుత్వం.

# మహిళాభివృద్ధి కోసం 'స్వయం' బ్రాండ్... నేనే అంబాసిడర్‌గా ఉంటా

మహిళల కోసం ప్రత్యేకంగా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసింది కూడా ఎన్టీఆరే అని గుర్తుచేశారు. తాను గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉద్యోగాలు, కళాశాలల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించానని, ఆ నిర్ణయం వల్లే నేడు ఐటీ వంటి రంగాల్లో మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారని వివరించారు. భవిష్యత్తులో చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు రాబోతున్నాయని, ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని రాజకీయాల్లోకి రావడానికి మహిళలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.మహిళల భద్రత విషయంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏమాత్రం రాజీపడదని చంద్రబాబు తేల్చిచెప్పారు. "ఎవరైనా ఆడబిడ్డల జోలికి వస్తే, అదే వారికి చివరి రోజు అవుతుంది. అలాంటి దుర్మార్గులను కఠినంగా హెచ్చరిస్తున్నా. మీ భద్రతకు చంద్రన్న ఉన్నంతవరకు భయపడాల్సిన అవసరం లేదు," అని ఆయన భరోసా ఇచ్చారు. రాష్ట్ర హోంమంత్రిగా కూడా ఒక మహిళే (అనిత) ఉన్నారని, ఎక్కడ సమస్య ఎదురైనా తక్షణమే స్పందిస్తారని గుర్తుచేశారు.ఇదే సమయంలో, రాష్ట్రంలో జనాభా తగ్గుదలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "ఒకప్పుడు 'ఒక బిడ్డ ముద్దు, ఇద్దరు ఓకే, ముగ్గురు వద్దు' అన్నాను. కానీ ఇప్పుడు 'ఒక బిడ్డ వద్దు, ఇద్దరు ఓకే, ముగ్గురు ముద్దు' అని చెబుతున్నాను. రాష్ట్రంలో జననాల రేటు 1.5కి పడిపోయింది. ఇది ప్రమాదకరం. అందుకే పెద్ద కుటుంబాలను ప్రోత్సహించేందుకు అవసరమైతే మూడు పడకగదుల ఇల్లు, అదనపు రేషన్ వంటి ప్రోత్సాహకాలు అందిస్తాం" అని నూతన విధానాన్ని ప్రకటించారు.

# ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరిని ఈ సంఘటన కలిచివేసింది

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపై ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పట్ల మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ప్రభుత్వం వ్యవహరించిన తీరు అత్యంత బాధాకరమని, ఇది తీవ్ర ఆక్షేపణీయమని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరిని ఈ సంఘటన కలిచివేసిందని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఇంటర్నేషనల్ సంతాల్ కాన్ఫరెన్స్ సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలపై ఆయన ఆదివారం ఒక ప్రకటనలో స్పందించారు.సంతాల్ సమాజం గొప్ప సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించేందుకు నిర్వహించిన ఈ అంతర్జాతీయ సదస్సులో.. అదే సామాజిక వర్గానికి చెందిన రాష్ట్రపతికి సరైన ప్రాధాన్యత దక్కకపోవడం విచారకరమని మాధవ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధించిన ప్రోటోకాల్ పాటించడంలో, అధికారుల సమన్వయంలో మమతా సర్కార్ పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి అక్కడి పరిపాలనలోని అరాచక ధోరణిని బయటపెడుతోందని విమర్శించారు.దేశ పౌరుల రాజ్యాంగ హక్కులను కాలరాయడమే కాకుండా, ప్రథమ పౌరురాలైన రాష్ట్రపతి గౌరవాన్ని కూడా కాపాడలేని స్థితిలో బెంగాల్ ప్రభుత్వం ఉందని దుయ్యబట్టారు. గిరిజన సోదర సోదరీమణులు ఎంతో ఆత్మీయంగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతిని అవమానించడం అంటే.. అది దేశాన్ని అవమానించడమేనని మాధవ్ అన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను గౌరవించే ప్రతి ఒక్కరూ ఈ ఘటనను నిరసిస్తున్నారని, ఇలాంటి చర్యలే టీఎంసీ ప్రభుత్వ పతనాన్ని సూచిస్తున్నాయని పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు.

# జేడీయూలో అధికారికంగా చేరిన నితీశ్ కుమార్ తనయుడు

బీహార్ రాజకీయాల్లో ఆదివారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కుమారుడు నిశాంత్ కుమార్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఆదివారం మధ్యాహ్నం పట్నాలోని జేడీయూ కేంద్ర కార్యాలయంలో ఆయన అధికారికంగా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమానికి జేడీయూ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ కుమార్ ఝా, కేంద్ర మంత్రి లలన్ సింగ్, మంత్రులు విజయ్ కుమార్ చౌదరి, బిజేంద్ర ప్రసాద్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు ఉమేశ్ సింగ్ కుష్వాహ తదితర సీనియర్ నేతలు హాజరయ్యారు.పార్టీలో చేరిన సందర్భంగా సంజయ్ కుమార్ ఝా.. నిశాంత్‌కు పార్టీ టోపీ, జ్ఞాపికను అందించగా, కేంద్ర మంత్రి లలన్ సింగ్ సంప్రదాయ తలపాగా చుట్టి ఘనంగా ఆహ్వానించారు. అనంతరం సీనియర్ నేతల కాళ్లకు నమస్కరించి నిశాంత్ ఆశీర్వాదం తీసుకున్నారు.ఈ సందర్భంగా నిశాంత్ కుమార్ మాట్లాడుతూ... తన తండ్రి మార్గదర్శకత్వంలోనే పనిచేస్తానని స్పష్టం చేశారు. "ఈరోజు నేను పార్టీలో చేరడానికి వచ్చాను. మా నాన్న రాజ్యసభకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అది ఆయన నిర్ణయం. ఆయన సూచనల మేరకు బీహార్ కోసం మేం పనిచేస్తాం" అని పేర్కొన్నారు. నితీశ్ కుమార్ రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, ఆ వారసత్వాన్ని ముందుకు తీసుకెళతానని చెప్పారు. కార్యకర్తలు పార్టీపై ఇదే ఉత్సాహం, నమ్మకం కొనసాగించాలని కోరారు.కాగా, నిశాంత్ కుమార్ త్వరలోనే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ప్రజలతో మమేకమవుతారని జేడీయూ ఎమ్మెల్సీ నీరజ్ కుమార్ తెలిపారు. చంపారన్ ప్రాంతం నుంచి ఆయన తన రాజకీయ యాత్రను ప్రారంభించే అవకాశముందని పార్టీ వర్గాల సమాచారం. గతంలో నితీశ్ కుమార్ కూడా తన రాజకీయ యాత్రలను అక్కడి నుంచే మొదలుపెట్టేవారు. రాబోయే రోజుల్లో పార్టీ సంస్థాగత బలోపేతంలో నిశాంత్ కీలక పాత్ర పోషిస్తారని, పార్టీ అప్పగించే ఏ బాధ్యతనైనా చిత్తశుద్ధితో నిర్వహిస్తారని జేడీయూ వర్గాలు భావిస్తున్నాయి.

# న్యూయార్క్ మేయర్ మమ్దానీ ఇంటి వద్ద బాంబుల కలకలం... ఆరుగురి అరెస్ట్

న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీ నివాసం వెలుపల శనివారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. 'యాంటీ ముస్లిం' నిరసన ప్రదర్శనలో ఆందోళనకారులు స్క్రూలు, బోల్టులతో నింపిన 'స్మోకింగ్ ప్రొజెక్టైల్స్' (పొగ వచ్చే పేలుడు వస్తువులు) విసరడం కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు.రైట్ వింగ్ యాక్టివిస్ట్ జేక్ లాంగ్ ఆధ్వర్యంలో ఈ నిరసన జరిగింది. సుమారు 20 మంది మద్దతుదారులు అక్కడ చేరగా.. వారికి వ్యతిరేకంగా 100 మందికి పైగా కౌంటర్ ప్రొటెస్టర్లు నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం పెరిగి ఘర్షణకు దారితీసింది. లాంగ్ మద్దతుదారులు పెప్పర్ స్ప్రే చల్లడంతో పరిస్థితి అదుపు తప్పింది. ఇరువర్గాలు గుడ్లు విసురుకుంటూ, పిడిగుద్దులతో దాడులు చేసుకున్నాయి.

ఈ గొడవలో ఓ వ్యక్తి పొగలు వెదజల్లే రెండు వస్తువులను జనం మధ్యలోకి విసిరాడు. అవి ఈస్ట్ 87వ వీధిలో పడి మంటలు రావడంతో జనం భయంతో పరుగులు తీశారు. ఇవి టేపుతో చుట్టిన జాడీలని, అందులో నట్లు, బోల్టులు, స్క్రూలు నింపి ఉన్నాయని, అలాగే ఫ్యూజ్ కూడా అమర్చారని పోలీస్ కమిషనర్ జెస్సికా టిష్ తెలిపారు. బాంబ్ స్క్వాడ్ బృందాలు వీటిని పరిశీలిస్తున్నాయి.ఘటన జరిగిన సమయంలో మేయర్ మమ్దానీ, ఆయన భార్య ఇంట్లో లేరని పోలీసులు స్పష్టం చేశారు. ఈ దాడిని మేయర్ ప్రతినిధి తీవ్రంగా ఖండించారు. ఇది ముస్లిం వ్యతిరేక చర్య అని, అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. పేలుడు వస్తువులు విసిరిన 18 ఏళ్ల ఎమిర్ బాలాట్, అతనికి సహకరించిన 19 ఏళ్ల ఇబ్రహీం నిక్, పెప్పర్ స్ప్రే చల్లిన ఇయాన్ మెక్‌గిన్నిస్‌తో పాటు మొత్తం ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఉద్రిక్తత కొనసాగుతోంది.

# శ్రీలంక తీరంలో ఇరాన్ యుద్ధనౌకపై దాడి... అమెరికా ముందే హెచ్చరించిందా?

- మొదటి పేజి తరువాయి

వెంటనే నౌకను వదిలిపెట్టి వెళ్లాలని ఇరాన్ యుద్ధ నౌక కమాండర్‌ను రెండుసార్లు ఆదేశించినట్లు తెలుస్తోంది. జలాంతర్గామి దాడికి కొన్ని నిమిషాల ముందు నౌకలోని ఓ సిబ్బంది తన తండ్రికి ఫోన్ ద్వారా తెలియజేసినట్లు మీడియాలో వార్తలు వచ్చాయి. మార్చి 4న జలాంతర్గామి నుంచి హెచ్చరికలు వచ్చాయని, సిబ్బంది ఖాళీ చేసి వెళ్లిపోవాలని సూచన చేశారని తెలుస్తోంది. అయితే యుద్ధ నౌక కమాండర్ మాత్రం అందుకు ససేమీరా అన్నారు. దీనితో సిబ్బందిలోని కొంతమంది కమాండర్‌తో వాదనకు దిగినట్లు తెలుస్తోంది. కొంతమంది కమాండర్ ఆదేశాలను ధిక్కరించి లైఫ్ బోట్ల ద్వారా ప్రాణాలతో బయటపడ్డారని తెలుస్తోంది. అమెరికా జలాంతర్గామి నుంచి హెచ్చరికలు వచ్చాయని తెలిపిన నౌక సిబ్బంది ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయారని తెలుస్తోంది.

## ఇళ్లలోంచి బయటికి రావొద్దు...

ఇరాన్ పౌరులకు అమెరికా సైన్యం ఆదివారం కీలక హెచ్చరిక జారీ చేసింది. ఇరాన్ సైన్యం జనావాసాల మధ్య నుంచే డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగిస్తున్నందున ప్రజలు ఇళ్లలోనే ఉండాలని సూచించింది. ఈ వ్యూహం వల్ల లక్షలాది మంది సామాన్యుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని, దాడులు తీవ్రమవుతున్న వేళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది.అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్ కామ్) ప్రకారం.. ఇరాన్ మిలటరీ డెజ్ ఫుల్, ఇస్ఫహాన్, షిరాజ్ వంటి రద్దీగా ఉండే నగరాల నుంచి తమ కార్యకలాపాలు సాగిస్తోంది. ఇలాంటి ప్రాంతాలను సైనిక అవసరాలకు వాడటం వల్ల అంతర్జాతీయ చట్టాల ప్రకారం అవి రక్షణ హోదాను కోల్పోతాయని, ప్రతీకార దాడులకు గురయ్యే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఇరాన్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే అమాయక ప్రజల ప్రాణాలను పణంగా పెడుతోందని సెంట్ కామ్ కమాండర్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ ఆరోపించారు. ఇరాన్ తమ పొరుగు దేశాల్లోని పౌర విమానాశ్రయాలు, హోటళ్లపై కూడా విచక్షణారహితంగా దాడులు చేస్తోందన్నారు.తాము పౌరులకు హాని కలగకుండా సాధ్యమైనంత వరకు జాగ్రత్తలు తీసుకుంటున్నామని, అయితే ఇరాన్ సైనిక స్థావరాలుగా వాడుకుంటున్న ప్రాంతాల్లో భద్రతకు గ్యారంటీ ఇవ్వలేమని అమెరికా స్పష్టం చేసింది. ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్ వందల కొద్దీ క్షిపణులను ప్రయోగించినప్పటికీ, తమ ప్రతిఘటనతో ఆ వేగం తగ్గిందని పేర్కొంది.మరోవైపు, ఉద్రిక్తతల నేపథ్యంలో మధ్యప్రాచ్యం నుంచి అమెరికన్లను సురక్షితంగా తరలించే ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఫిబ్రవరి 28 నుంచి ఇప్పటివరకు 32,000 మందికి పైగా అమెరికన్లు క్షేమంగా స్వదేశానికి చేరుకున్నారని అసిస్టెంట్ సెక్రటరీ డైలాన్ జాన్సన్ తెలిపారు. ఒమన్, కువైట్, సౌదీ అరేబియా, యూఏఈ తదితర దేశాల నుంచి ప్రత్యేక విమానాల ద్వారా తరలింపు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.

## నారీశక్తి వట్టిమాటే... మోదీ, చంద్రబాబుపై షర్మిల ఫైర్

ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మహిళల భద్రత, సంక్షేమం విషయంలో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆమె ఆరోపించారు. ఆకర్షణీయమైన పథకాలతో మహిళలను మభ్యపెట్టి మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు.చంద్రబాబు ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో మహిళలకు ఇచ్చిన మూడు హామీలను విస్మరించి నయవంచనకు పాల్పడిందని షర్మిల విమర్శించారు. 'మహాశక్తి' పథకం కింద 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు రూ.1500 ఇస్తామని చెప్పి 1.80 లక్షల మందిని, 'తల్లికి వందనం' కింద 20 లక్షల మంది తల్లులను మోసం చేశారని ఆరోపించారు. వడ్డీ లేని రుణాల హామీతో 1.18 లక్షల డ్వాక్రా మహిళలను వంచించారని అన్నారు. ఇంటికి మూడు సిలిండర్లు ఇస్తామని చెప్పి ఒకటి మాత్రమే ఇచ్చారని, ఇప్పుడు గ్యాస్ ధరలు పెంచి వంటింటిపై భారం మోపారని మండిపడ్డారు.కేంద్ర ప్రభుత్వంపై కూడా షర్మిల విమర్శలు చేశారు. దేశంలో గంటకు 50 మంది మహిళలపై దాడులు జరుగుతుంటే 'నారీశక్తి వందన్' ఎక్కడుందని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం మహిళలను కేవలం ఓట్లు వేసే యంత్రాలుగా మాత్రమే చూస్తోందని ఆమె వ్యాఖ్యానించారు.అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను విస్మరించి, వారిని అర్ధరాత్రి అరెస్టు చేయించి అవమానించారని దుయ్యబట్టారు. రెండేళ్ల పాలనలో కుటుంబాలపై రూ.15 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపిన కూటమి ప్రభుత్వం, మహిళలను ఉద్ధరించామని చెప్పుకోవడానికి సిగ్గుపడాలని షర్మిల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దివంగత వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు గ్యాస్ ధరల భారాన్ని ప్రభుత్వమే మోసేదని ఆమె గుర్తుచేశారు.

## కాంగ్రెస్ నిర్ణయంతో ఇరాన్‌తో భారత్ సంబంధాలు దెబ్బతిన్నాయి

- మొదటి పేజి తరువాయి

తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. యూపీఏ ప్రభుత్వం ఆరోజు తీసుకున్న నిర్ణయం భారత్, ఇరాన్ సంబంధాలను దెబ్బతీసిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ దేశానికి అనుకూలంగా మాట్లాడకపోయినా పర్వాలేదు కానీ ప్రజల్లో భయాందోళనలు కలిగించే తప్పుడు ప్రచారం చేయవద్దని హితవు పలికారు.గతంలో ఇరాన్‌కు వ్యతిరేకంగా వ్యవహరించిన కాంగ్రెస్, ఇప్పుడు ఇరాన్‌కు అనుకూలంగా మాట్లాడుతున్నట్లు నటిస్తూ, భారతదేశంలో చమురు కొరత ఉందని తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. యూపీఏ హయాంలో కేవలం 16 దేశాల నుంచి మాత్రమే చమురు దిగుమతి చేసుకునే వారమని, నరేంద్ర మోదీ ప్రభుత్వం వచ్చాక ఆ సంఖ్య 40 దేశాలకు పెరిగిందని అన్నారు. గ్యాస్ సిలిండర్ ధరలపై ఎటువంటి ప్రభావం ఉండదని ఆయన హామీ ఇచ్చారు.దేశంలో తగినంత ఇంధనం, గ్యాస్ స్టాక్ ఉందని రామచందర్ రావు తెలిపారు. ప్రస్తుతం ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో ఆందోళన కలిగించే అబద్ధపు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. చైనాతో రహస్య ఒప్పందాలు చేసింది కాంగ్రెస్ పార్టీయే అన్నారు.తెలంగాణలో ఖజానా ఖాళీ అయిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిత్యం కథలు చెబుతున్నారని, కానీ అదే ప్రజల ధనంతో ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారం ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. కేరళలో జరుగుతున్న ఎన్నికల ప్రచారం కోసం కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారని ఆరోపించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోదని తెలిపారు. తెలంగాణలో ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు.

# తడి పొడి ప్రమాదకరచెత్త ప్రచారానికే,,!

**స్మార్ట్ సిటీ పేరుతో స్మార్ట్ దోపిడీ!"లాభం" ఎవరికి ?**

**ప్రచారానికి లక్షలు ! చెత్త డబ్బాలకు కోట్లు ఖర్చు**

**ప్రజల మద్యే ప్రచారం!**

**తడి పొడి ప్రమాదకర చెత్త వేరు చేయకుండా డంపింగ్ యార్డ్ కు తరలింపు వేరుచేసేది ఎక్కడ ! చేసేది ఎవరు ?**

**నెలల తరబడి జీతాలు లేని సిబ్బందితో ఇది సాధ్యమేనా ?**

**చెత్తను కాలువలలో రోడ్లపై అలవాటుగా విసిరివేసే ప్రజలకు(కొందరికి) ఇది సాధ్యమేనా ?**







**విశాఖ తూర్పు,పెన్ పవర్,మార్చి 8:**గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నగర సుందరీకరణ స్మార్ట్ సిటీ డెవలప్మెంట్,స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర, స్వచ్ఛభారత్, నగరం పరిశుభ్రంగా ప్రజలు ఆరోగ్యంగా జీవించాలనే ప్రధాన ఉద్దేశంతో చేపట్టే పథకాలు పేర్లు ఏమైనా పథకాలు ఎన్ని ఉన్నప్పటికీ ఏళ్ల తరబడి తడి చెత్త పొడి చెత్త ప్రమాదకర అతి ప్రమాదకర చెత్త సేకరణలు ప్రజలను చైతన్య పరుస్తూ చేపట్టే ప్రచారాలు ప్రచారం వరకే పరిమితం అన్నసంగతి అందరికీ తెలిసిన విషయమే, ప్రతి నెల స్వచ్ఛ పర్యవేక్షణ, పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలతో పరిసరాలను శుభ్రపరుస్తూ స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ రంగ సంస్థలలో వీటిని అమలు పరుస్తున్నారు.ఇంతవరకు బానే ఉంది కానీ తడి చెత్త పొడి చెత్త ప్రమాదకర చెత్త పై అవగాహన కల్పిస్తూ ప్రజలకు వీధి నాటకాలు రూపంలో వివరించి ఇచ్చిన డబ్బాలు ఇళ్లకే పరిమితమయ్యాయి. చెత్త సేకరించేందుకు ప్రతి ఇంటికి వచ్చే సిబ్బందికి కొందరు మాత్రమే చెత్తను అందజేస్తున్నారు మిగిలిన వారు రోడ్లపై కాలువలో పడవేస్తున్నారు.

పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు నెలలు తరబడి ఇవ్వకపోవడంతో తడి చెత్త పొడి చెత్తలపై వారికి అవగాహన ఉన్నా ప్రతినెల వేతనాలు ఆలస్యం అవ్వడంతో విధులు నిర్వహించడం వారికి భారంగా మారింది. ప్రజల నుంచి వచ్చే ప్రశ్నలకు వారు జవాబు చెప్పలేని పరిస్థితిలో ఉన్నారు. తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా ఇమ్మని సిబ్బంది చెప్పడం సరైనది అయినప్పటికీ చెత్తను తరలించే వాహనాలలో లేదా డంపింగ్ యార్డులో అంతా కలిసే వెళుతుంది కదా అని ప్రజలు ఎదురు ప్రశ్నిస్తున్నారు. ప్రజల ప్రశ్నలకు అధికారుల వద్ద సమాధానము లేక చేసేదిలేక మిన్నకుంటున్నారు.

స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్లు,జీవీఎంసీ అధికారులు తడి పొడి ప్రమాదకర చెత్తలపై సిబ్బంది స్వచ్ఛంద సంస్థలకు, ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా తడి పొడి చెత్త లపై ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు అధికారుల వద్ద సరైన జవాబు ఉన్నదా అన్నది ప్రశ్నగా మారింది. పవ

పారిశుద్ధ కార్మికులకు నెలవారి వేతనాలు క్రమం తప్పకుండా వేతనాలు ఇచ్చి వారికి ఉద్యోగ భద్రత కల్పించి తడి పొడి చెత్తలపై అధికారులు పూర్తి అవగాహనతో ప్రజల వద్దకు రావాలని,నగరంలోగల మురికివాడలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించే చర్యలు చేపట్టాలి. అవగాహన కార్యక్రమాలకు లక్షలు వెచ్చించి కోట్ల రూపాయలతో తడి పొడి చెత్త డబ్బాలు కొనుగోలు చేయడంలో అధికారులు ఆలోచించాలని ప్రజలు కోరుతున్నారు. ఇళ్లల్లో ప్రతి ఇంటిలో చెత్త డబ్బా ఒకటి ఉంచడానికి ఇబ్బంది పడే ప్రజలు మూడు డబ్బాలు లేదా నాలుగు డబ్బాలు ఉంచడం వాటికి ప్రత్యేకంగా స్థలం కేటాయించడం ఆచరణ సాధ్యం కాదని ప్రజలు అధికారుల తీరును తప్పుపడుతున్నారు.









శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# మహిళా సాధికారతకు ప్రభుత్వాల కట్టుబాటు





**విశాఖలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 08 :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఆదివారం ఆంధ్ర విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంబన మరి యు మహిళల సమగ్ర అభివృద్ధిపై ప్రజాప్రతిని ధులు, అధికారులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో భీమిలి ఎమ్మె ల్యే గంటా శ్రీనివాసరావు, విశాఖ ఉత్తర ఎమ్మె ల్యే విష్ణుకుమార్ రాజు, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, జీసీసీ ఎండీ శోభిక తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళా సాధికార త ఒక్కరోజు జరుపుకునే కార్యక్రమం కాదని, సమాజం మొత్తం మహిళల అభివృద్ధి కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ మహిళలకు ఆస్తి హక్కులు కల్పించడం, స్థానిక సంస్థల్లో వారికి ప్రాధాన్యం ఇవ్వడం వంటి చారిత్రాత్మక నిర్ణయాలతో మహి ళలకు విశేష గుర్తింపు తీసుకొచ్చారని గుర్తుచేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డు కూడా అదే దిశగా పలు సంక్షేమ కార్యక్ర మాలు అమలు చేస్తున్నారని తెలిపారు. డ్వాక్రా సంఘాలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందా యని, "తల్లికి వందనం", "స్త్రీ శక్తి" వంటి పథ కాలు మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహద పడుతున్నాయని చెప్పారు. ఆనందపురం మం డలం గిడిజాల వద్ద మహిళల కోసం 50 ఎకరా ల్లో ప్రత్యేక ఆర్థిక మండలి రూపుదిద్దుకుంటున్న సమయం ఇదని అన్నారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన స్టాళ్లలో మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు, అభివృద్ధి కార్యక్రమాలు స్పష్టంగా కనిపించాయని చెప్పారు. మహిళల శక్తి అపారమని, ప్రతి రంగంలో కనీసం 50 శాతం మహిళల భాగస్వామ్యం ఉండాలని ఆకాంక్షించారు. చదువు, ఆరోగ్యం విషయంలో మహిళలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. "బాల సంజీవని", "బేటీ బచావోబేటీ పడావో", "స్త్రీ శక్తి", "తల్లికి వందనం" వంటి పథకాల ద్వారా మహిళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్తృత సహాయం అందిస్తున్నాయని తెలిపారు. తల్లికి వందనం పథకం ద్వారా సుమారు 40 లక్షలకుపైగా మహిళలకు ప్రయోజనం చేకూరిం ద ని వెల్లడించారు. పీఎంఈజీపీ ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నా మని వివరించారు.

అంధ క్రికెటర్ కరుణ కుమారికి సత్కారం

అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన అంధ మహిళా క్రికెట్ క్రీడాకారిణి పి. కరుణ కుమారిని అతిథులు ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. అలాగే జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, జీసీసీ ఎండీ శోభికలను సన్మానించారు. ప్రత్యేక ఉప కలెక్టర్ శేషశైలజ, జిల్లా కోఆపరేటివ్ అధికారిణి ప్రవీణ, జూ క్యూరేటర్ మంగమ్మ, సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ ఉషారాణి, జీవీఎంసీ అదనపు కమిషనర్ సత్యవేణి, ఐసీడీఎస్ పీడీ రామలక్ష్మి తదితరులతో పాటు వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన 59 మంది మహిళా అధికారులకు, సిబ్బందికి అవార్డులు అందజేసి సత్కరించారు.

స్టాళ్ల సందర్శన, లబ్ధిదారులకు పథకాల పంపిణీ

కార్యక్రమానికి ముందు ఎమ్మెల్యే గంటా శ్రీనివా సరావు, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీసీపీలు మేరీ ప్రశాంతి, మణికంఠ చందోలు, లతా మాధు రి స్టాళ్లను సందర్శించి మహిళలు తయారు చేసిన వివిధ ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు ఆస్తి పత్రాలను అందజేశారు. ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సమకూర్చిన రూ.3 లక్షల విలువ గల ఆటోలను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఎ. పీడీ లక్ష్మీపతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ, విభిన్న ప్రతి భావంతుల శాఖ ఏడీ కవిత తదితరులు పాల్గొన్నారు.

# మహిళా దినోత్సవం వేడుకలా లేక ఆత్మపరిశీలనా?




**ములగాడ, పెన్ పవర్, మార్చి 08:** మహిళ అనేది కేవలం ఒక వ్యక్తి కాదుడ ఒక కుటుంబానికి ఆదారం, సమాజానికి ఆదర్శం, సృష్టికి మూలం. తల్లి పొత్తుల్లో పుడుతూ ప్రపంచానికి వెలుగు చూపే అమ్మతనం మహి ళలోనే ఉంటుంది. కానీ అదే మహిళ జీవితం నేటి సమాజంలో ఎన్నో కష్టాలు, అన్యాయాలు, హింసల మధ్య సాగుతున్నది అనే చేదు నిజం మన ముందుంది.

పుట్టుక నుంచి మహిళకు ఎదురయ్యే సవాళ్లు ఇంకా పూర్తిగా తగ్గలేదు. బాలికగా పుట్టిన క్షణం నుంచి వివక్ష, విద్యలో అడ్డంకులు, వేధింపులు, సామాజిక ఒత్తిడులు వంటి సమస్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. కొన్నిసార్లు కళ్ళు తెరవకముందే ఆమె జీవితాన్ని అణచివేసే సంఘటనలు కూడా జరుగుతున్నాయి.దేశం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతున్నా, మహిళలపై జరుగుతున్న దాడులు, వేధింపులు, హత్యలు, అత్యాచా రాలు వంటి ఘటనలు తరచూ వార్తల్లో కనిపించడం ఆందోళన కలిగిస్తోంది. ఒకవైపు మహిళా సాధికారత, సమానత్వం గురించి మాట్లాడుతుంటే, మరో వైపు మహిళల భద్రతపై ప్రశ్నలు ఇంకా మిగిలే ఉన్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి సంవత్సరం మార్చి 8న జరుపుకునే అంతర్జాతీయ మహిళా దినోత్సవం కేవలం వేడుకలకే పరిమితం కాకుండా, సమాజం ఆత్మపరిశీలన చేసుకునే రోజుగా మారాలి. మహిళలకు నిజమైన గౌరవం ఇవ్వాలంటే వారి భద్రత, స్వేచ్ఛ, సమాన అవకాశాలు నిర్ధారించాల్సిన అవసరం ఉంది.

మహిళను గౌరవించే సంస్కృతి ప్రతి మనసులో మొదలవ్వాలి. ఒక మహిళ భయపడకుండా జీవించే సమాజం ఏర్పడిన ప్పుడే మహిళా దినోత్సవానికి నిజమైన అర్థం ఉంటుంది.

మహిళలపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టి, వారికి సమాన హక్కులు, గౌరవం, రక్షణ కల్పించే సమాజాన్ని నిర్మించడం మన అందరి బాధ్యత. అప్పుడు మాత్రమే మహిళా దినోత్సవం నిజమైన వేడుకగా మారుతుంది.

# వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో






**ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 08 :**విశాఖపట్నంలోని మద్దిలపాలెం కృష్ణ కాలేజీ రోడ్డులో ఉన్న పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గ పరిశీలకురాలు పేడాడ రమణికుమారి అధ్యక్షత వహించారు.ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు హాజరై మహిళా నాయకులతో కలిసి కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన పేర్కొన్నా రు.కార్యక్రమంలో భాగంగా మహిళల కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిం చారు. అలాగే మహిళా కార్పొరేటర్లు, నియోజ కవర్గ మహిళా అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు మరియు సీనియర్ మహిళా నాయకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్య లో మహిళలు పాల్గొని వేడుకలను ఉత్సాహం గా జరుపుకున్నారు.

ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్ కుమార్, తిప్పల దేవన్ రెడ్డి, మొల్లి అప్పారావు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, డిప్యూటీ మేయర్, రాష్ట్ర మరియు మాజీ జిల్లా స్థాయి వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, జీవీఎంసీ కార్పొరేటర్లు, రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యులు, నగర జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీ సభ్యులు, మాజీ రాష్ట్ర మరియు జిల్లా స్థాయి కార్పొరేషన్ డైరెక్టర్లు, వార్డు అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ మరియు వార్డు స్థాయి మహిళా నాయకులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

01

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

క్లాసిఫైడ్ యాడ్స్

కేవలం

యాడ్ 100/-కే

' ఐదు రోజులకు '

'4 సెం.మీ 4 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి

# ఆర్ఏ ఆర్ఎస్ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం.





- విద్యార్థినిలు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలి.
- ఏడిఆర్ డాక్టర్. ఆళ్ల అప్పలస్వామి.

**చింతపల్లి పెన్ పవర్ మార్చి 8.** ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం చింతపల్లిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి ఏ డి ఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గిరిజన ప్రాంతంలో ఉన్నటువంటి మహిళలు అలాగే విద్యార్థినులు ఆర్థికంగా ,సామాజికంగా, రాజకీయ రంగాలలో రాణించాలని అన్నారు. అలాగే వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచుకొని విలువ ఆధారిత ఉత్పత్తులు తయారీ కూడా నేర్చుకుని వాటిని మార్కెట్ చేసే విధంగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థినిలు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటిని సాకారం చేసుకునే దిశగా ముందుకు సాగాలని సూచించారు. వ్యవసాయ రంగంలో కూడా మహిళల యొక్క ప్రాధాన్యత అత్యంత కీలకంగా ఉంటుందని, మహిళలు వ్యవసాయ రంగంలో పురోగతిని సాధిస్తూ ఆర్థికంగా ఇప్పుడిప్పుడే ఎదుగుతున్నారన్నారు. మహిళల యొక్క హక్కులు చట్టాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో పనిచేస్తున్న మహిళలకు అభినందనలు తెలియజేయడంతో పాటు వారిని సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త బయ్యపురెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాల హుస్సేన్ రెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి. వెంకటేష్ బాబు, డాక్టర్ బి. ఎన్. సందీప్ నాయక్, డాక్టర్ పి. జోగారావు, శాస్త్రవేత్తలు మరియు ఆఫీసు సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళలు సమాజ అభివృద్ధికి పునాది..
## కిమిడి రామ్ మల్లిక్ నాయుడు



**చీపురుపల్లి పెన్ పవర్ మార్చి 08** ఈరోజు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చీపురుపల్లి పట్టణంలోని టీటీడీ కళ్యాణ మండపంలో ఉమెన్ డెవలప్మెంట్ సెల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో యువనేత, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీ కిమిడి రామ్ మల్లిక్ నాయుడు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు సమాజ అభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. కుటుంబం నుంచి సమాజం వరకు ప్రతి రంగంలో మహిళలు తమ ప్రతిభను చాటుకుంటూ ముందుకు సాగుతున్నారని తెలిపారు. మహిళల సాధికారత, వారి అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం పనిచేస్తుంది అని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలను అభినందించి, వారి సేవలను ప్రశంసిస్తూ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళా ప్రతినిధులు మరియు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.


## ఘనంగా చీపురుపల్లి డిసిసిబి బ్రాంచ్ మేనేజర్ కల్పన ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు.




**చీపురుపల్లి పెన్ పవర్ మార్చి 08.** ఈరోజు చీపురుపల్లి పట్టణంలో గల డిసిసిబి బ్యాంక్ నందు బ్రాంచ్ మేనేజర్ కల్పన ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చీపురుపల్లి మండల ప్రజా పరిషత్ మాజీ అధ్యక్షురాలు రౌతు కాంతమ్మ పాల్గొన్నారు. బ్రాంచ్ మేనేజర్ కల్పన అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకొని కాంతమ్మను సన్మానించడం జరిగినది. ఆమెకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా డిసిసిబి బ్యాంకులో డిపాజిట్లు కలిగి ఉన్న మహిళలను కూడా సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఝాన్సీ , క్యాషియర్ నూక రత్నం ఇతర మహిళలు మరియు మహిళా సిబ్బంది పాల్గొన్నారు.ది

## మహిళా కానిస్టేబుల్, హోంగార్డులకు సన్మానం.

- పోలీసు శాఖలు విధులు నిర్వహణ అంటే సాహసంతో కూడుకున్నది.
- చింతపల్లి ఏఎస్పీ నవ జ్యోతి మిశ్రా.




**చింతపల్లి పెన్ పవర్ మార్చి 8.** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని చింతపల్లి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్, హోంగార్డులకు చింతపల్లి ఎస్పీ కార్యాలయంలో ఘన సన్మాన కార్యక్రమం జరిగింది. ఆదివారం జరిగిన ఈ వేడుకలకు స్థానిక ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా ముఖ్య అతిథిగా హాజరయ్యారు . ఈ సందర్భంగా ఆయన మహిళా సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేస్తూ వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళల పాత్ర వెలకట్టలేనిదని, పోలీసు శాఖ వంటి కఠినతరమైన శాఖలో మహిళలు పనిచేస్తూ రాణించడం వారి ధైర్య సాహసాలకు అద్దం పడుతుందన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూనే ఒకవైపు గృహిణిగా కుటుంబాన్ని చక్కదిద్దడంలో మహిళా లు బహుముఖ ప్రజ్ఞాపాటవాలు ప్రదర్శిస్తుంటారు అన్నారు. స్త్రీలు శక్తినారీమణులుగా అనాదికాలం నుంచి కొనియాడ పడుతూ వస్తున్నారని అటువంటి స్త్రీ మూర్తులను గౌరవించుకోవడం ఎంతో ఆనందదాయకమన్నారు. అమ్మగా చెల్లిగా భార్యగా బహుముఖ పాత్రలు పోషించే స్త్రీలు సమ సమాజ నిర్మాణానికి కారకులున్నారు. అటువంటి స్త్రీ మూర్తులను గౌరవించుకోవడం మన ధర్మమన్నారు. అనంతరం మహిళా కానిస్టేబుల్, హోంగార్డులకు దుస్సాలువ కప్పి , జ్ఞాపికలను అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం .వినోద్ బాబు, ఎస్సైలు, జి. వీరబాబు, వెంకటరమణ, పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ధన సహాయం అందించిన :గోవింద్ రెడ్డి



**కూర్మన్నపాలెం: పెన్ పవర్, మార్చి 08:**జివియంసి 69 వార్డు తుంగ్లాశీ గ్రామంలో అకస్మాతుగా మరణించిన చిందాడ అర్జున్ రావు కుటుంబానికి వార్డ్ కార్పొరేటర్ గోవింద్ రెడ్డి 5000రూపాయలు అందజేశారు.

# గీతం యూనివర్సిటీకి ప్రభుత్వ భూముల

### క్రమబద్ధీకరణపై తీవ్ర విమర్శలు
### ప్రజా, న్యాయ పోరాటానికి సిద్ధం కేకే రాజు



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 08 :**విశాఖపట్నంలో సుమారు రూ.5 వేల కోట్ల విలు వైన 54.79 ఎకరాల ప్రభుత్వ భూమిని గీతం యూనివర్సిటీకి క్రమబద్ధీకరించేలా జివిఎంసీ కౌన్సిల్లో తీర్మానం ఆమోదించడం ఆందోళన కరమని వైఎస్సార్సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు అన్నారు. ఈ నిర్ణయంపై సరైన చర్చ లేకుండానే అధికార బలంతో పెద్ద ఎత్తున భూ దోపిడీ జరుగుతోందని ఆయన ఆరోపించారు.

ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశం లో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ అండతో ఈ ప్రక్రియ కొనసాగుతున్నదని విమర్శించారు. ఇంకా ప్రభుత్వ జీవో విడుదల కాకముందే గీతం యాజమాన్యం భూమిని చదును చేసే పనులు ప్రారంభించడం దుర్మార్గమైన చర్య అని పేర్కొ న్నారు. గతంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన "ప్రభుత్వ భూమి" బోర్డులను తొలగించి లెవలిం గ్ పనులు చేపడుతున్నారని తెలిపారు.

వైఎస్సార్సీపీ ప్రభుత్వం సమయంలో గీతం యూనివర్సిటీ ఆక్రమించిన 40 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్నా మని కేకే రాజు చెప్పారు. ఇంకా 14 ఎకరాల భూమిపై కోర్టులో కేసు పెండింగ్లో ఉండగా స్టేటస్ కో ఉన్నప్పటికీ అక్కడ పనులు కొనసాగు తున్నాయని ఆయన పేర్కొన్నారు.

విశాఖలో కార్పొరేట్ సంస్థలకు పప్పు బెల్లాల ధరలకు భూములు కేటాయిస్తున్నారని ఆయన విమర్శించారు. చిన్న వ్యాపారుల దుకాణాలు కూల్చే ప్రభుత్వం, కార్పొరేట్ ఆక్రమణలపై మా త్రం చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.

పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గీతం భూ ఆక్రమణలపై ప్రజా పోరాటం తో పాటు న్యాయపోరాటం కూడా చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని కేకే రాజు స్పష్టం చేశారు.

## మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టర్ దినేష్ కుమార్ చేతుల మీదుగా సన్మానం



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 8:**అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉత్తమ ఉద్యాన అధికారిణిగా జీకేవిధి మండలంలో పనిచేస్తున్న అరుణ కుమారి ఎంపికయ్యారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం పాడేరులో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆమెకు అవార్డు అందజేసి సన్మానించారు.ఉద్యాన శాఖ అభివృద్ధికి ఆమె అందించిన సేవలను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్,మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, రాష్ట్ర జానపద కళలు సృజనాత్మకత అకాడమీ చైర్మన్ డాక్టర్ వంపూరు గంగులయ్య పాల్గొని అవార్డు గ్రహీతను అభినందించారు.జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పలువురు ప్రభుత్వ అధికారిణులకు కూడా మహిళా దినోత్సవం సందర్భంగా అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చంద్రబాబు సీఎం కావాలని మొక్కు

### తిరుమలకు పాదయాత్ర ప్రారంభించిన వెంకటేశ్వరరావుకు టీడీపీ నేతల ఘన వీడ్కోలు



**విశాఖ దక్షిణం పెన్ పవర్, మార్చి 08 :**ముఖ్యమంత్రి సీఎం అయితే తిరుమలకు పాదయాత్రగా వెళ్లి మొక్కు తీర్చుకుంటానని సంకల్పించిన విశాఖ ఉత్తర నియోజకవర్గానికి చెందిన వెంకటేశ్వరరావు ఆదివారం తన పాద యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికి వీడ్కోలు పలికారు.ఆదివారం ఉదయం విశాఖలోని వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వెంకటేశ్వరరావు తిరుమల వైపు పాదయాత్రను ప్రారంభించారు. అక్కడి నుంచి బయలుదేరి జిల్లా టీడీపీ పార్టీ కార్యాలయానికి చేరుకున్న ఆయనను పార్టీ నాయకులు, కార్య కర్తలు ఘనంగా స్వాగతించారు.ఈ సందర్భంగా విశాఖ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు పట్టాభి మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు ముఖ్య మంత్రి అయితే తిరుమలకు నడిచివెళ్లి మొక్కు తీర్చుకుంటానని వెంకటేశ్వరరావు సంకల్పిం చారని తెలిపారు. ఆయన చేపట్టిన ఈ పాద యాత్ర విజయవంతంగా పూర్తి కావాలని, దేవు డు ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాల ని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పార్టీ నాయకులు వెంకటేశ్వరరావును పార్టీ కార్యాల యం వరకు వచ్చి ఘనంగా సాగనంపారు.

ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి లోడగల కృష్ణ, రాష్ట్ర పార్టీ కార్యదర్శి తోట రత్నం, పైలా ముత్యాలనాయుడు, సర్వసిద్ధి అనంతలక్ష్మి, గొంప ధర్మ, కుట్టా కార్తీక్, బమ్మిడి ఉమ, ఈతలపాక సుజాత, కేదారి లక్ష్మి, బోయి రమాదేవి, గనగళ్ల సత్య, బొడ్డేపల్లి లలిత, పీవీ వసంతరావు, వాసుపల్లి రాజు, దవల విజయ్కుమారి, ప్రమీలరావు, సౌజన్య, హరిత, హేమ, వై ఆదిలక్ష్మి, అప్పల నరసింహమ్మ తదితరులు పాల్గొన్నారు.

## డిబేట్ పోటీలో కేజీబీవీ విద్యార్థిని

### భువనేశ్వరి ప్రతిభ జిల్లాస్థాయిలో మొదటి బహుమతి



**పద్మనాభం, పెన్ పవర్, మార్చి 08 :**అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్క రించుకుని నిర్వహించిన డిబేట్ పోటీలలో పద్మనాభం మండలంలోని కృష్ణాపురం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న కస్తూరిబాయి బాలి కల పాఠశాల (కేజీబీవీ) విద్యార్థిని భువనేశ్వరి జిల్లాస్థాయిలో మొదటి బహుమతిని సాధిం చింది.పద్మనాభం పోలీస్ బృందం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా పలు పోటీ లను నిర్వహించారు. ఈ పోటీలలో కేజీబీవీ పద్మనాభం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవ త్సరం చదువుతున్న భువనేశ్వరి డిబేట్ పోటీ లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

విజేత భువనేశ్వరికి బహుమతిని విశాఖ నగర పోలీస్ కమిషనర్ , డీసీపీ-1 , డీసీపీ-2 లా అం డ్ ఆర్డర్ మేరీ ప్రశాంతి చేతుల మీదుగా అంద జేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డీ.ఈ.ఓ ప్రేమ్ కుమార్, డిప్యూటీ డీఈఓ చంద్ర శేఖర్, ఏపీసీ జి. శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# మహిళా దినోత్సవ వేడుకల్లో
# రూ.1013.23 కోట్ల మెగా చెక్కులు పంపిణీ



**విశాఖ దక్షిణం పెన్ పవర్, మార్చి 08 :**అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ పథకాల కింద బ్యాంక్ లింకేజీ ద్వారా సమకూ ర్చిన రూ.1013.23 కోట్ల విలువైన మెగా చెక్కు లను జిల్లా కలెక్టర్ ఎం. ఎన్. హరేందిర ప్రసాద్ లబ్ధిదారులకు అందజేశారు.ఆదివారం విశాఖ పట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. 202526 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు పథకాల ద్వారా మహిళా సంఘాల సభ్యులకు అందిం చిన రుణాలు, ఆర్థిక సహాయం వివరాలను డి.ఆర్.డి.ఎ. మరియు మెప్మా శాఖలు నివేది కల రూపంలో ప్రదర్శించాయి.

ఈ సందర్భంగా డి.ఆర్.డి.ఎ. ఆధ్వర్యంలో సమకూర్చిన రూ.256.14 కోట్ల చెక్కు, జీవీఎం సీ అర్బన్ కమ్యూనిటీ డెవలప్మెంట్ యూసీడీ ద్వారా రూ.747.69 కోట్ల చెక్కు, అలాగే పీఎం స్వానిధి పథకం కింద రూ.9.40 కోట్ల విలువైన చెక్కులను జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జా యింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి కలిసి లబ్ధిదా రులకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఎ. ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మీపతి, అదనపు కమిషనర్ సత్యవేణి తదితర అధికారులు పాల్గొన్నారు.

# వధూవరులకు ఆశీర్వాదాలు

**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,మార్చి 8:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం లకవరపుపేట పంచాయితీ ఎల్.కొత్తపాలెం గ్రామంలో ఆదివారం నిర్వహించిన వంతల వారి వివాహ వేడుకకు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు. మండల వైసీపీ అధ్యక్షులు కంకిపాటి గిరిప్రసాద్, వైసీపీ సీనియర్ నాయకులు కంకిపాటి రామారావు, మచ్చల మత్స్యరాజు, వంతల చంటిబాబు, కంకిపాటి నారాయణ, రాంబాబు, పెద్దలు చిరంజీవి, మండల పేసా ప్రధాన కార్యదర్శి మాదిరి చంటిబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వధూవరులు రామకృష్ణ, శ్రీదేవిలను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.



# పరిశ్రమల సి ఎస్ ఆర్ నిధులతో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు





**గాజువాక పెన్ పవర్, మార్చి 08:**పారిశ్రామిక ప్రాంతం గాజువాక లోఉన్న పరిశ్రమలు, నియోజవర్గంలో ఉన్న చెరువులు, పార్కుల అభివృద్ధికి, కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సి ఎస్ ఆర్ నిధుల తో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పనకు రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు స్థానిక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు చర్యలు చేపట్టారు . పల్లా ఆదేశాల మేరకు నియోజవర్గ అభివృద్ధిలో భాగంగా, జివియంసి. 69 , 79 వార్డు ల పరిధిలో ఉన్న చెరువులు, పార్కులను సుందరీకరణ కోసం పర్యటనలో భాగంగా, ఎపి స్టేట్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మొల్లి పెంటిరాజు వార్డులో ఉన్న తుంగ్లం పెద్ద చెరువు, చాలేటి చెరువు, గల్లావానిపాలెం చెరువు, పాత అగనంపూడి చెరువు లను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల జీవన ప్రమాణాలను పెంచడంలో భాగంగా పార్కులు, చెట్ల పెంపకం, చెరువుల అభివృద్ధి ముఖ్య పాత్ర పోషిస్తాయని, గాజువాక ప్రాంతంలో ఉన్న ముఖ్యమైన పరిశ్రమలు సి యస్ ఆర్ నిధుల నుండి, ఈ చెరువులు, పార్కుల అభివృద్ధికి సహకరించాలని, పరిశ్రమల నుండి వచ్చిన వాయు కాలుష్యం వలన , భూములు ఇచ్చిన నిర్వాసితుల గ్రామాలు, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అనారోగ్యాలు పాలవుతున్నారు. వారి ఆరోగ్యాలకు అవసరం అయ్యే చెట్లను పెంచడం, చెరువులను అభివృద్ధి పరచడం వలన కాలుష్యాన్ని తగ్గించవచ్చుని, పరిశ్రమ యాజమాన్యాలు వీటి అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ప్రజల ఆరోగ్యం కోసం, జీవన ప్రమాణాల మెరుగుకు పార్కులు, చెరువుల అభివృద్ధి ముఖ్యమని, వాటిని సుందరంగా తీర్చిదిద్ది, ప్రజలకు ఆహ్లాదకరమైన జీవనాన్ని అందించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. త్వరలోనే వీటిని గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ డిపార్ట్మెంట్ అధికారులు, గాజువాక ప్రాంతంలో ఉన్న పరిశ్రమలు సి యస్ ఆర్ డిపార్ట్మెంట్ వారితో సమన్వయం అయ్యి, వీటి అభివృద్ధి పనులకు చర్యలు తీసుకునేలా కృషి చేస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో 79వ వార్డు కార్పొరేటరు రౌతు శ్రీను, 69 వ జనసేన నాయకుడు కరణం ముత్యాల నాయుడు, 79వ వార్డ్ టిడిపి అధ్యక్షుడు కరుణం జగదీష్, 69 వ వార్డ్ ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి గోపాలకృష్ణ, 69 వ వార్డ్ క్లస్టర్ ఇంచార్జ్ గల్లా రుద్ర, మాడిసా వెంకటరావు, సూర్య నారాయణ, వెంకటేష్, మూర్తి, సాలపు దుర్గారావు, చుక్కా వాసు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం..!

* స్త్రీ అన్ని రంగాల్లో రాణించాలి. కూటమి ప్రభుత్వ.అరకు నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు సిరగం సూర్యకాంతం.





**హుకుంపేట పెన్ పవర్ మార్చి 8**

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గం హుకుంపేట మండల కేంద్రంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్థానిక ఎస్సై దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అరకు నియోజకవర్గ కూటమి ప్రభుత్వ మహిళా అధ్యక్షురాలు సిరగం సూర్యకాంతం మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించాలని ఆమె అన్నారు.

స్త్రీలు అంటే కేవలం వంటగదికే పరిమితం కాదని నింగికేకరే ఒక కల్పనా చావ్లా. పరుగు పందాలు రాణించిన పి.టి.ఉష. రాష్ట్రపతిగా కొనసాగుతున్నటువంటి ద్రౌపది మర్మము వంటి గొప్ప గొప్ప స్త్రీలు మనకు ఆదర్శం కావాలని ఆమె అన్నారు విద్యార్థి దశ నుండే స్త్రీలు గొప్ప ఆశయాలతో ఎదగాలని ఆటల్లో పాటల్లో రాణించాలని ఆమె అన్నారు. నేడు పురుషులతో సమానంగా సమాజంలో మెలుగుతున్న స్త్రీలు ఎంతోమంది ఉన్నారని ఈ సందర్భంగా ఆమె అన్నారు అనేకమంది డాక్టర్లు లాయర్లు. ఇంజనీర్లు నర్సులు వంటి ఉన్నతమైన ఉద్యోగాలు చేస్తూ దేశానికి వెన్నుముకై నిలిచారని ఆమె స్త్రీలను కొనియాడారు. అంతే కాకుండా. అసలు మహిళా దినోత్సవాన్ని ఎందుకు జరుపుకుంటారు అన్న అంశంపై ఆమె మాట్లాడారు ప్రతి ఏటా మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటారని. మహిళలు ఆర్థిక సాంస్కృతిక మరియు రాజకీయ సాధనలను గుర్తించడానికి లింగా సమానత్వ ప్రోత్సాహానికి అలాగే మహిళా హక్కులు సాధన కొరకు అనేక పోరాటాలు చేసిన వారికి గుర్తు చేసుకోవడం కోసం ప్రతి ఏడా మార్చి 8న మహిళా దినోత్సవం జరుపుకుంటారని ఈ సందర్భంగా ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొమ్మ రమా. మాజీ ఎంపీటీసీ సత్యవతి మరియు కళావతి ద్రౌపతి దేనా తదితరులు పాల్గొన్నారు హుకుంపేట విద్యార్థిని విద్యార్థులు మహిళలు స్థానిక మోదకొండమ్మ గుడి నుంచి నాలుగు రోడ్లు కూడలి వరకు జయహో మహిళా అంటూ నినాదాలు చేసుకుంటూ హుకుంపేట కేంద్రంలో మానవహారం ఏర్పాటు చేశారు. అంతేకాకుండా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు మరియు దాడులు వంటివి జరగకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా అన్నారు ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు స్థానిక ఎస్సై దుర్గాప్రసాద్ మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# మహారాణిపేటలో మెగా రక్తదాన శిబిరం





**పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ ప్రారంభం**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 08 :** విశాఖపట్నం మహారాణిపేటలోని రెడ్ క్రాస్ కార్యాలయంలో మధురవాడ చర్చ్ ఆఫ్ గాడ్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు డీజీపీ మరియు నగర పోలీస్ కమిష నర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ రక్తదానం ఒక గొప్ప సేవా కార్యక్రమమని పేర్కొన్నారు. రక్తదానం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడే అవ కాశం ఉంటుందని తెలిపారు. రక్తదానం చేయ డం వల్ల ఆరోగ్యపరంగా కూడా పలు ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ఇలాంటి రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ అవసరంలో ఉన్నవారికి సహాయం చేస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించా రు.ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ బాలస తీష్ మాట్లాడుతూ థలసేమియా వంటి వ్యాధు లతో బాధపడుతున్న రోగులకు రక్తం ఎంతో అవసరమని తెలిపారు. సమాజ సేవలో భాగం గా చర్చ్ ఆఫ్ గాడ్ సంస్థ ముందుకు వచ్చి రక్త దాన శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయ మని అన్నారు.

ఈ శిబిరంలో పెద్ద సంఖ్యలో స్వచ్ఛంద రక్తదా తలు పాల్గొని ఉత్సాహంగా రక్తదానం చేశారు. చర్చ్ ఆఫ్ గాడ్ ప్రతినిధులు, రెడ్ క్రాస్ బాధ్యు లు మరియు స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నా రు.

## క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రతిభ పరీక్షలకు చింతపల్లి డిగ్రీ విద్యార్థులు.



**చింతపల్లి పెన్ పవర్ మార్చి 8.** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు ప్రభుత్వం రూపొందించిన స్వయం మరియు మూక్స్ నిర్వహిస్తున్న క్వాంటమ్ కంప్యూటర్ ప్రతిభ పరీక్షలకు విశాఖపట్నంలో హాజరయ్యారు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. ఎం విజయభారతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ స్టేట్ కమిషనరేట్ హయ్యర్ ఎడ్యుకేషన్ ద్వారా చేపడుతున్న క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రతిభ పరీక్షలకు కళాశాల నుండి 52 మంది విద్యార్థులు విశాఖ పట్నం చేరుకున్నారన్నారు. తుది పరీక్షలో విద్యార్థులు అర్హత సాధించి కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక బృందానికి ఆమె అభినందనలు తెలిపారు. తుది తుది పరీక్షలకు తీసుకెళ్లిన మూక్స్ కోఆర్డినేటర్ ఐ రవీంద్ర నాయక్, అధ్యాపకులు వివి రమణ, టి ఉమా, పి మయూరి తదితరులు హాజరైనట్లు ఆమె తెలిపారు.

# మహిళల రక్షణకై ప్రతిష్టమైన చర్యలు తీసుకోవాలి

**బాలికల పాఠశాల 2లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుక.**

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, మార్చి 08.**మహిళల రక్షణకై పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదివాసీ మహిళా సంఘం ముంచంగిపుట్టు మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్.విజయ, ఎస్.ఈశ్వరి అన్నారు. మండల కేంద్రంలో గల బాలికల ఉన్నత పాఠశాల2లో మహిళ దినోత్సవ వేడుక ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ, ఈశ్వరిలు మాట్లాడుతూ.. నేడు మహిళలు ఆకాశంలో సగం, అవకాశంలో సగం ఉన్నప్పటికీ అడుగు అడుగున్న వివక్షకు గురవుతున్నారన్నారు. ఇంట బయట ఏ పనికైనా మహిళలు లేనిదే పని కావటం లేదనీ, అయినప్పటికీ ప్రతి రోజూ, ప్రతి నిమిషానికి మహిళలు దాడులు ఎదుర్కొంటున్నారన్నారు. అనేక పోరాటాల ఫలితంగా చట్టాలు, హక్కులు ఉన్నా వాటినీ అమలు చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నారనీ, అందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల అభివృధి కోసం, మహిళల రక్షణ కోసం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆమే డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, పాఠశాల విద్యార్థినిలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# 13 వార్డు లో మహిళా దినోత్సవ వేడుక

**పాల్గొన్న వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ**

**విశాఖ తూర్పు,పెన్ పవర్, మార్చి 8:**అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ 13వ వార్డులో కార్పొరేటర్ కార్యాలయంలో అంగన్వాడీ టీచర్లు,ఆశా వర్కర్లు,కూటమి మహిళా నాయకుల సమక్షంలో వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ, వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు,పార్లమెంటరీ పార్టీ అధికార ప్రతినిధి ప్రోత్రకొండ ధర్మారావు వార్డు ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి,మహిళ సీనియర్ నాయకురాలు నల్లని వరలక్ష్మి స్థానిక నాయకులతో కలిసి కేక్ కట్ చేయడం జరిగింది.

ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, సమాజంలో స్త్రీల బాధ్యతలను గుర్తు చేస్తూ,మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని, ప్రతి మహిళా అవకాశం ఉన్నంత వరకు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని,పది మందికి అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఆమె పిలుపునిచ్చారు. "స్త్రీ తన ఇంటి బాధ్యతలను, పిల్లల పెంపకాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూనే,రాబోయే తరాలకు మంచి భవిష్యత్తును అందించాలి. అందుకు పిల్లలకు నాణ్యమైన చదువును అందించడమే కాకుండా,వారి ఎదుగుదలకు తగిన కృషి చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు ఎస్.కెనూరి, అనకాపల్లి రామలక్ష్మి, కర్రీ మనీ,గంటాదేవి,రమా,బుడత కనకదుర్గ, ఎస్.కె.లల్లు,కనకాల శ్రీను. అంగన్వాడీ టీచర్లు ఆశ వర్కర్లు,తదితరులు పాల్గొన్నారు.



## మహిళల సేవలు అమూల్యం

* మహిళా కార్మికులను సత్కరించిన వీఎంఆర్డీఏ



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 08 :**అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో నగరంలోని పలు ఉ ద్యానవనాల్లో పనిచేస్తున్న మహిళా కార్మికు లను ఘనంగా సన్మానించారు. వీఎంఆర్డీఏ చైర్మన్ మహిళా కార్మికులకు శాలువాలు కప్పి వారి సేవలను అభినందించారు.

ఈ కార్యక్రమం హెల్త్ అరీనా వీఎంఆర్డీఏ పార్క్ మరియు సెంట్రల్ పార్క్లలో పనిచేస్తున్న మ హిళా సిబ్బందిని గౌరవిస్తూ నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ ప్రతి మహిళ సమాజంలో తల్లి, చెల్లి, అక్క, భార్య వంటి పలు పాత్రలను సమర్థంగా నిర్వ హిస్తూ కుటుంబం మరియు సమాజానికి ఆధార స్తంభంగా నిలుస్తుందని అన్నారు. ముఖ్యంగా ఉద్యోగ బాధ్యతలతో పాటు కుటుంబ బాధ్య తలను సమతుల్యంగా నిర్వహిస్తూ మహిళలు చూపిస్తున్న అంకితభావం అభినందనీయం అన్నారు.నగరంలోని పార్కులు శుభ్రంగా, పచ్చ దనంతో కళకళలాడుతున్నాయంటే అందుకు మహిళా కార్మికుల కృషే ప్రధాన కారణమని ఆయన కొనియాడారు. అలాగే రాష్ట్ర ముఖ్య మంత్రి మహిళల అభ్యున్నతి కోసం పలు సం క్షేమ పథకాలను అమలు చేస్తూ వారి సాధికా రతకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ శిరీషతో పాటు వీఎంఆర్డీఏ సిబ్బంది పాల్గొన్నారు.ం

## మహిళల హక్కులపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ






**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,మార్చి 8:**అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మహిళా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. జీకే వీధి ఎస్ఐ సురేష్ నాయకత్వంలో ఈ ర్యాలీ జరిగింది.మహిళలపై జరుగుతున్న అన్యాయాలు, దాడులను అరికట్టడం అలాగే మహిళల హక్కులపై సమాజంలో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు.ఈ ర్యాలీలో స్థానిక మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలు, వారి హక్కులపై అవగాహన కల్పించారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా మహిళలు ధైర్యంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. మహిళా సాధికారతకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తోడ్పడాలని పిలుపునిచ్చారు.

# డా.కెఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం వేడుకలు

- నిష్ణాతులైన, విశిష్ట సేవలు అందించిన మహిళలకు ఘన సత్కారం





**గాజువాక: పెన్ పవర్, మార్చి 08:**సమాజ అభివృద్ధిలో మహిళలు తమ యొక్క పాత్రను పోషిస్తూ అన్ని రంగాల్లో రాణిస్తున్నారని బిజెపి ఏపీ మీడియా పేనలిస్ట్, గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. జీవీఎంసీ గాజువాక సమీపం,పాత కర్ణవానిపాలెం బిజెపి కార్యాలయం వద్ద ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ రంగాల్లో నిష్ణాతులైన సుమారు యాభైనాలుగు మంది మహిళలను ఒకే వేదిక పైకి తీసుకొచ్చి సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకప్పటితో పోల్చితే నేడు మహిళలు అన్నింటా ముందుంటున్నారని అన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కారు, రాష్ట్రంలో కూటమి ఆధ్వర్యంలో మహిళలకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తూ వస్తున్నారని తెలిపారు. ఒకవైపు కుటుంబ బాధ్యతలు చూస్తూనే మరోవైపు వ్యాపార,ఉద్యోగ,రాజకీయ రంగాల్లో తమదైన ప్రతిభను చూపిస్తూ మహిళా శక్తిని చాటుతున్నారని కొనియాడారు. మహిళా అభ్యున్నతికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని వీటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు,ప్రముఖ ఆధ్యాత్మికవేత్త భాస్కరభట్ల ప్రసాద్ శర్మ మంత్రోచ్చారణ చేయగా మహిళలందరినీ కేఎన్ఆర్ సన్మానించి మొమెంటోలు అందజేశారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారిని డాక్టర్ పి.హేమలత, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కృష్ణవేణి,జనసేన రాష్ట్ర నాయకులు గడసాల అప్పారావు,బిజెపి నాయకులు గూటూరు శంకర్రావు,దీనంకొండ పావని,కృష్ణంరాజు,బాటా శ్రీనివాస్,కట్టా పద్మ,రోహిణి,భువనేశ్వరి ,సీనియర్ న్యాయవాది కరణం జ్యోతి,లెక్చరర్ ఉషామల్లిక,భాగ్యశ్రీ,కూచిపూడి గురు రమ్యరిషితశ్రీ,ఏఎన్ఎమ్ శైలజ, ఆశా వర్కర్ ముంతాజ్,విజయలక్ష్మీ,మహిళా పోలీస్ హారిక ,భారతి,శంకరి,మండల అధ్యక్షుడు ఒమ్మి రంగనాయకులు, జిల్లా కార్యదర్శి కొల్లిమనోహర్ ,కృష్ణారెడ్డి,సిరసపల్లి అప్పారావు,అమ్మాజీ, పూర్ణ, శిరీష,ఉషారాణి, కళావతి,లంకా లత, సునీత తదితరులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్.



**గుమ్మలక్ష్మీపురం మార్చి 07 పెన్ పవర్.**అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్.ఆదివారం నాడు కురుపాం మండల కేంద్రంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిధిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు కురుపాం నియోజకవర్గ శాసన సభ్యురాలు తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. ఎమ్మెల్యే ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి,ప్రార్ధన గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల అభివృద్ధి,సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.మహిళలు విద్యతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అలాగే మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత స్థానాల్లో నిలవాలన్నారు.ప్రభుత్వం పరంగా మహిళా అభివృద్ధికి అన్ని రకాల సహాయ సహకారం అందించటం జరుగుతుందని,మహిళా స్వయం ఉపాధికి తగిన ప్రోత్సాహం అందిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు.ఇంటికే పరిమితం కాకుండా ఉన్నతమైన చదువులు చదివి మంచి ఉద్యోగాలు సాధించి ఆదర్శంగా నిలవాలని విద్యార్థినిలకు సూచించారు.తద్వారా సమాజంలో మహిళలకు గౌరవం,గుర్తింపు వస్తుందని.ఉత్తమ సేవలందించిన వారికి సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్ పర్సన్ కద్రక కళావతి,ట్రైకర్ బోర్డు స్టేట్ డైరెక్టర్ పువ్వల లావణ్య,నియోజకవర్గ మహిళా కార్యదర్శి వెంపటాపు భారతి,తోటపల్లి దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు ఆరిక జానకి,గ్రామైక సంఘ మండల అధ్యక్షులు సుబ్బలక్ష్మి,ఎంపిటిసి సభ్యులు సంతోషి,స్పెషల్ ఆఫీస్,మహిళలు,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమ పథకాలు పక్కాగా అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం :పల్లా





**కూర్మన్నపాలెం :పెన్ పవర్, మార్చి 08:**మహా విశాఖ నగరపాలక సంస్థ86 వార్డు లో 6కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు . ప్రపంచ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు, కూటమి ప్రభుత్వము వార్డులో చేపట్టిన పలు అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించి,భవిష్యత్తులో కూడా మరిన్ని అభివృద్ధి పనులను చేసి వార్డు అభివృద్ధి చేస్తానని అందరికీ హామీ ఇచ్చారు . కార్యక్రమం 86 వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నల్లూరి సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగగా, క్లస్టర్ ఇంచార్జ్ వేగుంట శ్రీనివాస్, జనసేన వార్డు అధ్యక్షుడు కాదా శ్రీను, జనసేన నాయకులు గంధం వెంకట్రావు, గంటల త్రినాథ్, తెలుగుదేశం వార్డు ప్రధాన కార్యదర్శి బొడ్డేడ జగదీష్, ఉపాధ్యక్షుడు కొర్లానా రమేష్, గాజువాక తెలుగు యువత అధ్యక్షుడు మనపురం గణపతి, వార్డు సెక్రటరీలు రాయుడు నాగేశ్వరరావు, కసాపు వెంకటేష్, కోశాధికారి బొడ్డేపల్లి అప్పారావు, బూత్ ఇంచార్జ్ లు గోవింద్ ప్రధాన్, ఓబిలినేని లక్ష్మణరావు, నరహరశెట్టి రమణారావు, వి ఆర్ కె రాజు,నూనె లోకేష్,కండేపల్లి అప్పారావు, బొర్రా లక్ష్మి, చందన, కొలుసు వీరభద్రరావు, ఎస్.కె మౌలా, వార్డ్ బీసీ సెల్ అధ్యక్ష, కార్యదర్శులు కోటపాటి సుబ్బయ్య, బొబ్బిలి శ్రీను, వార్డు మహిళా అధ్యక్షురాలు గుంపన లక్ష్మి, వార్డు తెలుగు యువత అధ్యక్ష, కార్యదర్శిలు లక్ష్మణ్, సునీల్, వార్డు నాయకులు సిహెచ్ నాయుడు,అలుగు అప్పలస్వామి, సాగి శ్రీనివాసరాజు,మరియు వార్డు ప్రజలు అందరూ పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు పునాది వేసింది తెలుగుదేశం పార్టీ

- చంద్రబాబుకత్వంలో మహిళల సంక్షేమం, భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత : పల్లా





**గాజువాక : పెన్ పవర్,మార్చి 08:** సృష్టికి మూలం, సమాజ ప్రగతికి దీపమైన మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు . గాజువాక జోనల్ కార్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని మహిళల సాధికారత, సమాజ నిర్మాణంలో వారి కీలక పాత్రను ప్రస్తావించారు. మహిళల అభివృద్ధి, సమాన అవకాశాలు మరియు అన్ని రంగాలలో వారి ప్రగతికి అందరూ కలిసి సహకరించాలని పిలుపునిచ్చారు.

మహిళా సాధికారతకు పునాది వేసింది టీడీపీ ఘనత దక్కుతుందన్నారు.

మహిళలకు ఆస్తిలో సమాన హక్కులు కల్పించడం, డ్వాక్రా సంఘాల ఏర్పాటు, విద్యా,ఉద్యోగాల్లో అవకాశాలు పెంచడం వంటి చారిత్రక నిర్ణయాలతో మహిళా సాధికారతకు పునాది వేసింది తెలుగుదేశం పార్టీనే అని ,

మహిళల ఆర్థిక స్వావలంబన కోసం తీసుకున్న నిర్ణయాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు.

చంద్రబాబు నాయకత్వంలో మహిళల సంక్షేమానికి ప్రాధాన్యత కే పెద్ద పీట వేస్తుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం మహిళల సంక్షేమం, భద్రత, ఆర్థిక సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పల్లా అన్నారు. తల్లికి వందనం, స్త్రీ శక్తి, ఉచిత గ్యాస్ వంటి పథకాల ద్వారా మహిళలకు అండగా నిలుస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం ద్వారా ప్రతి నెల మహిళలు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు ఆదా అవుతుందన్నారు. మహిళల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మహిళలపై దాడులు జరిగితే వెంటనే కఠిన చర్యలు తీసుకునేలా చట్టాలను అమలు చేస్తున్నామని పల్లా తెలిపారు. మహిళల భద్రతను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటూ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందన్నారు. అంగన్వాడీ సిబ్బందికి ఆర్థిక స్వావలంబన కల్పిస్తూ వారి సంక్షేమానికి కూడా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

వైసీపీ పాలనలో మహిళల జీవితాలు దెబ్బతిన్నాయని విచారం వ్యక్తం చేశారు.

వైసీపీ పాలనలో జే-బ్రాండ్ మద్యం విధానంతో మహిళల జీవితాలను తీవ్రంగా దెబ్బతీశారని పల్లా విమర్శించారు. కుటుంబాలను ఆర్థికంగా, సామాజికంగా కష్టాల్లోకి నెట్టిన ఆ విధానాలు మహిళలకు పెద్ద భారం అయ్యాయని అన్నారు.

అన్ని రంగాల్లో మహిళలకు ప్రోత్సాహం ఇస్తున్నామన్నారు.


విద్య, ఉపాధి, ఆర్థిక రంగాల్లో మహిళలకు మరింత ప్రాధాన్యత కల్పిస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని,మహిళలు స్వావలంబనతో ఎదిగి సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు.

మహిళా సాధికారతే సమాజ ప్రగతికి పునాది అని, మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో నిలిచేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.



# సివిల్స్ లో సత్తా చాటిన గుమ్మల శ్వేతకు అభినందనలు





**కూర్మాన పాలెం : పెన్ పవర్, మార్చి08:** సివిల్ సర్వీసెస్ పరీక్షలో 573వ ర్యాంకు సాధించిన గాజువాక నియోజకవర్గం 87వ వార్డు ప్రాంతం కణితి గ్రామానికి చెందిన గుమ్మల శ్వేతను రాష్ట్ర కార్యదర్శి స్థానిక వార్డ్ కార్పొరేటర్ బొండా జగన్నాథం కుటుంబ సభ్యులు మరియు ప్రజాప్రతినిధులతో అభినందించారు. ముందుగా శ్వేతకు మిఠాయి తినిపించి బుకే మరియు సాల్వా తో సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధులు మాట్లాడుతూ శ్వేత అత్యంత కష్టమైన పరీక్షల్లో ఈ ఘనత సాధించిందని కష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చు అని పట్టుదల తపన ఏకాగ్రత కోల్పోకుండా ఉంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని అన్నారు. ఇంత అపూర్వ విజయంతో ఆమె ఇంట్లో సంబరాలు మిన్నంటాయి.ఈ కార్యక్రమంలో సెక్రెటరీ బొట్టా ప్రకాష్, డివి అప్పారావు, ప్రగడ దానయ్య, పావాడ వెంకటరమణమూర్తి, జీవి రమణ,దేవర పోలయ్య, జాన్ రమేష్,పోతల కృష్ణ,దాలయ్య, మూర్తి, బొండా లక్ష్మి, జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ అంగన్వాడీ కార్యకర్తగా పార్వతి

- ఆర్టీసీ చైర్మన్ సియ్యారీ దొన్నుదొర చేతుల మీదుగా అవార్డు స్వీకరణ.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, మార్చి 08.**అల్లూరి జిల్లా, ముంచంగిపుట్టు మండలం, పనసపుట్టు పంచాయతీ, కడుతుల గ్రామ అంగన్వాడీ కార్యకర్త సొలగం పార్వతి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉత్తమ అంగన్వాడి కార్యకర్త అవార్డును ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారీ దొన్నుదొర చేతుల మీదుగా అందుకున్నారు. 2025 - 26 సంవత్సరంలో ఉత్తమ అంగన్వాడి కార్యకర్తగా ఎన్నికైన పార్వతిని ఆర్టీసీ చైర్మన్ దొన్నుదొర దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. మహిళా దినోత్సవము రోజు ఉత్తమ అవార్డు రావడం ఆనందంగా ఉందని, తన పనిని గుర్తించి అవార్డు ఇచ్చిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు అంగన్వాడీ కార్యకర్త పార్వతి తెలిపారు. ఉత్తమ అంగన్వాడి కార్యకర్తగా ఎన్నికైన పార్వతిని మండల, జిల్లా వాసుల నుండి అభినందనలు వెలువెత్తుతున్నాయి.

# ప్రతి పార్క్ లో పశుపక్ష్యాదులు కోసం నీరు ఏర్పాటు చేయ్యాలి





- ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద పశుపక్ష్యాదులకు నీరు అందుబాటులో ఉంచాలి .
- చెత్త ను ఆదాయవంతంగా నిర్మూలించాలి
- పి నల్లనయ్య, అడిషనల్ కమిషనర్, జివిఎంసి

**విశాఖ మార్చ్ 8(పెన్ పవర్)**ప్రతి పార్క్ లో పశు పక్ష్యాదులు కోసం నీరు ఏర్పాటు చేయ్యాలి అని జివిఎంసి అడిషనల్ కమిషనర్ పి నల్లనయ్య పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం శివాజీ పాలెం లోని శివాజీ పార్క్ లో ఆనంద ఆదివారం, ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మహిళలకు అభినందనలు తెలియజేశారు. ఆనంద ఆదివారన్ని దృష్టిలో ఉంచుకుని పిచ్చుకల కోసం గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ నేతృత్వంలో ధాన్యం కంకులు కుచ్చులు చెట్ల కు పురుకూసతో కట్టి వేలాడ తీయడం, నీటి పాత్రలు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద పశుపక్ష్యాదులకు నీరు అందుబాటులో ఉంచాలి అని కోరారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద నుంచి వచ్చే చెత్త ను నాలుగు బకెట్ లలో విడదీసి వెయ్యాలని కోరుతూ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానంగా వంట ఇంటి నుంచి వచ్చే వ్యర్థాలు ఎరువుగా తయారు చేసి ఇంటి మేడ మీద కూరగాయలు ఆకుకూరలు పండ్లు పండించడం ద్వారా ఆరోగ్యవంతంగా జీవించాలి అని కోరారు.

ఈ కార్యక్రమంలో జివిఎంసి జోనల్ కమిషనర్ శివప్రసాద్, సిబ్బంది పురుషోత్తం తదితరులు, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం, ఆర్ పి లు, ఏక్షన్ ఎయిడ్ కర్ణాటక ప్రాజెక్ట్స్ సంస్థ ప్రతినిధి ఒ కృష్ణ కుమారి, వనమాలి సిటిజి గ్రూపుల ప్రతినిధి అంబిక, డాక్టర్ అనుపమ తదితరులు పాల్గొన్నారు.

# పసిడిని మించిన 'నల్ల బంగారం': కిలో ధర లక్షల్లో పలికే ప్రపంచపు ఖరీదైన కలప ఇవే!

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రకృతి ఒడిలో దాగి ఉన్న సంపద కేవలం వజ్రవైఢూర్యాలకే పరిమితం కాదు. కొన్ని రకాల వృక్షాలు పసిడి కంటే మిన్నగా, అత్యంత అరుదైన సంపదగా విరాజిల్లుతున్నాయి. సాధారణంగా మనకు ఎర్రచందనం అత్యంత ఖరీదైనదని తెలుసు, కానీ ప్రపంచ మార్కెట్‌లో దానిని మించిన విలువ కలిగిన అడవి సంపదలు కొన్ని ఉన్నాయి. అగర్ ఉడ్, ఆఫ్రికన్ బ్లాక్ ఉడ్, ఎబోని వంటి వృక్షాలు వాటి ప్రత్యేక గుణాల వల్ల ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన 'లిక్విడ్ గోల్డ్','బ్లాక్ డైమండ్స్'గా పిలవబడుతున్నాయి. వీటి ధరలు వింటే సామాన్యులు ఆశ్చర్యపోవాల్సిందే.

**అగర్ ఉడ్: దేవుళ్ల కలప!**

ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన కలపగా అగర్ ఉడ్ ను పేర్కొంటారు. దీనిని 'దేవుళ్ల కలప' అని కూడా పిలుస్తారు. వాస్తవానికి, ఈ చెట్టుకు 'ఫియలోఫోరా పారాసిటికా' అనే ఫంగస్ సోకినప్పుడు, ఆ ఇన్ఫెక్షన్ నుంచి తనను తాను రక్షించుకోవడానికి చెట్టు ఒక రకమైన సుగంధ రెసిన్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ రెసిన్ వల్లే అగర్ ఉడ్‌కు ఆ విపరీతమైన విలువ వస్తుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని నాణ్యతను బట్టి కిలో ధర రూ. 7 లక్షల నుంచి రూ. 25 లక్షల వరకు ఉంటుంది. దీని నుంచి తీసే నూనె (ౘబం ౘఅశ్రీ) లీటరు ధర రూ. 50 లక్షల పైమాటే. అత్యంత ఖరీదైన పెర్ఫ్యూమ్‌లు, అత్తరులు, ధూప ద్రవ్యాల తయారీలో దీనిని వాడతారు. అరబ్ దేశాల్లో దీనికి విపరీతమైన డిమాండ్ ఉంది.

**ఆఫ్రికన్ బ్లాక్ ఉడ్.. సంగీత వాయిద్యాల రారాజు!**

ఎర్రచందనం కంటే కొన్ని రెట్లు ఎక్కువ ధర పలికే మరో కలప ఆఫ్రికన్ బ్లాక్ ఉడ్ . ఇది ఆఫ్రికాలోని పొడి ప్రాంతాల్లో పెరుగుతుంది. ఈ చెట్టు పూర్తిస్థాయిలో పెరగడానికి దాదాపు 60 నుంచి 200 ఏళ్ల సమయం పడుతుంది. ఇది చాలా గట్టిగా, నీటిలో మునిగిపోయేంత సాంద్రత కలిగి ఉంటుంది. దీని కిలో ధర సుమారు రూ. 7 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు ఉంటుంది. ప్రపంచ ప్రఖ్యాత సంగీత వాయిద్యాలైన క్లారినెట్, ఒబో . బాగ్ పైప్స్ తయారీలో దీనిని వాడతారు. దీనికి ఉండే సహజమైన మెరుపు వల్ల లగ్జరీ ఫర్నిచర్ తయారీలోనూ దీనికి ప్రాధాన్యత ఇస్తారు.

**ఎబోని: రాజసం ఉట్టిపడే నలుపు!**

చీకటి లాంటి గాఢమైన నలుపు రంగులో ఉండే ఎబోని కలప శతాబ్దాలుగా సంపన్నతకు, రాచరికానికి ౘ చిహ్నంగా ఉంది. ఇది చాలా బరువుగా, నునుపుగా ఉంటుంది. సాధారణ కలప నీటిపై తేలితే, ఎబోని మాత్రం నీటిలో మునిగిపోతుంది. నాణ్యతను బట్టి దీని కిలో ధర రూ. 8 లక్షల వరకు ఉంటుంది. శ్రీలంకన్ ఎబోని వంటి రకాలు మరింత ఖరీదైనవి. పియానో కీలు, చెస్ బోర్డులోని నలుపు పావులు, ఖరీదైన కత్తుల పిడి వంటి వాటి తయారీలో దీనిని ఉపయోగిస్తారు. దీనికి ఉండే అద్దం లాంటి మెరుపు మరే ఇతర కలపలోనూ కనిపించదు.ప్రకృతి ప్రసాదించిన ఈ అపురూపమైన కలప రకాలు కేవలం వస్తువుల తయారీకే కాదు, ఒక దేశపు ఆర్థిక సంపదగా మారుతున్నాయి. అగర్ ఉడ్ నుంచి వచ్చే సుగంధం కానీ, ఆఫ్రికన్ బ్లాక్ ఉడ్ ఇచ్చే నాణ్యమైన సంగీతం కానీ, ఎబోని ఇచ్చే రాజసం కానీ సామాన్యులకు అందనంత ఎత్తులో ఉన్నాయి. అందుకే వీటిని 'నల్ల బంగారం' అని పిలవడం వంద శాతం సమంజసం. ఇలాంటి అరుదైన వృక్షాలను కాపాడుకోవడం మన బాధ్యత!

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ట్రంప్ ను వదలనంటున్న ఇరాన్.. ప్రతీకారం పీక్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్ , అమెరికా మధ్య ఉద్రిక్తతలు మరోసారి ముదురుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. తాజాగా ఇరాన్ సెక్యూరిటీ చీఫ్ అలీ లారిజాని చేసిన ప్రకటన అంతర్జాతీయ రాజకీయాల్లో సంచలనంగా మారింది. తమ అత్యున్నత నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ మరణానికి అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బాధ్యత వహించాల్సిందేనని ఈ ఘటనకు మూల్యం చెల్లించక తప్పదని ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో చేసిన పోస్టులో లారిజాని ఘాటుగా స్పందించారు. "మా నాయకుడి రక్తం వృథా కాదు. ట్రంప్‌ను వదిలే ప్రసక్తే లేదు. అతను చేసిన దానికి ప్రతీకారం తప్పకుండా తీసుకుంటాం" అని స్పష్టం చేశారు. ఈ ప్రకటనతో మధ్యప్రాచ్యంలో ఇప్పటికే ఉన్న ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.లారిజాని మరో కీలక వ్యాఖ్య కూడా చేశారు. మిడిల్ ఈస్ట్ దేశాలకు ఆయన హెచ్చరికలు జారీ చేశారు. అమెరికా తమ భూభాగాలను ఉపయోగించి ఇరాన్‌పై దాడులు చేయకుండా ఆ ప్రాంత దేశాలు అడ్డుకోవాలని కోరారు. "ఏ దేశం భూభాగం నుంచైనా ఇరాన్‌పై దాడి జరిగితే మేము కచ్చితంగా ప్రతిస్పందిస్తాం. ఆ ప్రాంతాన్ని కూడా లక్ష్యంగా చేసుకోవాల్సి వస్తుంది" అని ఆయన తేల్చి చెప్పారు. ఈ వ్యాఖ్యలు గల్ఫ్ ప్రాంత దేశాలకు ప్రత్యక్ష హెచ్చరికగా భావిస్తున్నారు.

ఇక ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్.జీసీ) కూడా కీలక ప్రకటన చేసింది. ఇటీవల జరిగిన ఉద్రిక్త పరిణామాల్లో కొందరు అమెరికన్ సైనికులను తమ బలగాలు బంధించాయని పేర్కొంది. అయితే ఈ విషయంపై అమెరికా అధికారికంగా స్పందించలేదు. అయినప్పటికీ ఈ ప్రకటన ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.ఇప్పటికే ఇరాన్ -- ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా పశ్చిమాసియా ప్రాంతం అట్టుడుకుతోంది. ఆయిల్ డిపోలు, సైనిక స్థావరాలపై దాడులు జరుగుతున్నట్టు సమాచారం వస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికా కూడా తన సైనిక దళాలను ఆ ప్రాంతంలో అప్రమత్తం చేసినట్లు అంతర్జాతీయ మీడియా నివేదిస్తోంది.అంతర్జాతీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. ఇరాన్ నాయకత్వం నుంచి వచ్చిన ఈ తాజా హెచ్చరికలు ప్రాంతీయ భద్రతకు పెద్ద సవాల్‌గా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా అమెరికా, ఇరాన్ మధ్య ప్రత్యక్ష ఉద్రిక్తతలు పెరిగితే గల్ఫ్ ప్రాంతంలో పెద్ద స్థాయి ఘర్షణలకు దారితీయవచ్చని వారు చెబుతున్నారు. మరోవైపు ఈ ప్రకటనలపై అమెరికా ప్రభుత్వం లేదా డొనాల్డ్ ట్రంప్ నుంచి ఇంకా అధికారిక స్పందన రాలేదు. కానీ ఇరాన్ చేసిన ఈ హెచ్చరికలు అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించాయి. పరిస్థితులు ఎలా మారుతాయో చూడాల్సి ఉంది. మొత్తానికి ఖమేనీ మరణం నేపథ్యంలో ఇరాన్ చేసిన ఈ ప్రతీకార ప్రకటన ప్రపంచ రాజకీయాల్లో కొత్త ఉద్రిక్తతలకు నాంది పలికే అవకాశాలు కనిపిస్తున్నాయి. పశ్చిమాసియాలో పరిస్థితులు మరింత సంక్లిష్టంగా మారే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## పదేళ్లుగా వీల్ చైర్ కే అంకితం.. విధిరాతను జయించిన ఆణిముత్యం

**హైదరాబాద్ పెన్ పవర్:** పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదు అని ఇప్పటికే ఎంతోమంది నిరూపిస్తున్నారు. ఈ క్రమంలోనే ఒక యువతి దాదాపుగా పది సంవత్సరాలుగా వీల్ చైర్ కే పరిమితమై.. తన జీవితం అంతే అని అనుకోకుండా విధి రాతను ఎదురించి మరీ సివిల్స్ ఫలితాలలో 483వ ర్యాంకు సాధించి అందరికీ ఆశ్చర్యం కలిగించారు. ఇక నేడు అంతర్జాతీయ మహిళా సందర్భంగా ఇటీవల వెలువడిన సివిల్స్ ఫలితాల ఆధారంగా బయటపడ్డ ఈ యువతి ప్రతి ఒక్కరికి రోల్ మోడల్ అనే చెప్పాలి. సివిల్స్ రాయడం అంటే కష్టం.. మనతో కాదు. మనం సాధించలేం అనే వారికి ఈమె ఒక స్ఫూర్తి అనడంలో సందేహం లేదు.

**విధిరాతను ఎదురించిన యువతి..**

కేరళకు చెందిన 30 సంవత్సరల అథిర.. బీడీఎస్ చదువుతుండగానే ఆక్సిడెంట్ జరగడంతో తల , వెన్నెముకకు తీవ్ర గాయాలయ్యాయి. ఛాతీ కింది భాగం ప్యారలైజ్ అయిపోయింది. కదలలేని పరిస్థితి.. రెండేళ్లు జ్ఞాపకశక్తి కూడా కోల్పోయింది. ఆ తర్వాత నెమ్మదిగా కోలుకొని బీడీఎస్ పూర్తి చేసింది. ఎన్జీవో లో డిసెబిలిటీ వింగ్లో పనిచేయడం వల్లే తనలో ఆత్మవిశ్వాసం పెరిగిందని, తన తల్లిదండ్రులు, సోదరి సహాయంతో ఈ అసాధ్యాన్ని సుసాధ్యం చేశానని అథిర చెప్పుకొచ్చింది. ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసి సివిల్స్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్న ఈ యువతి నేడు ఈ స్థాయిలో దేశవ్యాప్తంగా ర్యాంకు అందుకని అందరిని ఆశ్చర్యపరిచింది.. ఇక మహిళా దినోత్సవం సందర్భంగా సాధించిన విజయాన్ని సగౌరవంగా జరుపుకుంటూ ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

**సక్సెస్ పై అథిర భావోద్వేగం..**

ఇకపోతే తాను పడిన కష్టానికి దక్కిన ప్రతిఫలం గురించి ఆమె మాట్లాడుతూ భావోద్వేగం అయ్యారు.. దంత వైద్యురాలు కావాలన్నది నా కల . అందుకే విదేశాలలో ముఖ్యంగా ఫ్రాన్స్ లో ఎండీఎస్ చేయాలనుకున్నాను. కానీ ఈ ప్రమాదం నన్ను, నా ఆలోచనను పూర్తిగా మార్చేసింది. బహుశా ఈ ప్రమాదం జరిగి ఉండకపోతే నేను సివిల్స్ రాయాలన్న ఆలోచన గురించి ఒక్కసారి కూడా ఆలోచించేదాన్ని కాదేమో. పదేళ్ల క్రితం బెంగళూరులో బిడిఎస్ చదువుకునేటప్పుడు ఎప్పటిలాగే ఆ రోజు కూడా అలాగే బయటకు వెళ్లాను.. అయితే ఒక ఘోర రోడ్డు ప్రమాదం నా జీవితాన్ని అతలాకుతలం చేసింది .తలకు, వెన్నెముకకు తీవ్ర గాయాలయ్యాయి. రెండు సంవత్సరాల పాటు జ్ఞాపక శక్తిని కూడా కోల్పోయాను. మొదట్లో వైద్యులు నేను బ్రతికి ఉన్నా.. మంచానికే పరిమితం అవుతానని చెప్పారు. కానీ వెంటిలేటర్ పై పోరాడుతున్నప్పుడే ఒకరోజు నా వేలు కదలడంతో వైద్యుల్లో నేను కోలుకోగలుగుతుందనే ఆశ మొదలైంది. అనుకున్నట్లుగానే నెమ్మదిగా నా శక్తినంత కూడతీసుకొని చక్రాల కుర్చీలో కూర్చోగలిగాను. ఆ తర్వాత చాలా రోజులపాటు చికిత్స కొనసాగింది .నెమ్మదిగా నా జ్ఞాపకశక్తి తిరిగి వచ్చింది. చదువును కొనసాగించాలనుకున్నాను. అయితే ఈ ప్రమాదానికి ముందు మూడేళ్ల పాటు నేను చదువుకున్న విషయాలు ఏవి కూడా నాకు గుర్తులేవు. అయినప్పటికీ మళ్ళీ ఒక సంవత్సరం పాటు మొదటి నుంచి చదివాను. ఆపై ఫైనల్ పరీక్షలు రాసి బిడిఎస్ కోర్సు పూర్తి చేయగలిగాను. ఈ కఠిన సమయంలో నా చెల్లి, తల్లిదండ్రులు తోడుగా నిలిచారు" . అంటూ తన సక్సెస్ వెనుక పడ్డ శ్రమ గురించి చెప్పి అందరిని ఆశ్చర్యపరిచారు.

# నితీష్ ఢిల్లీలో కాలు-తేజస్వి నెత్తిన పాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** బీహార్ రాజకీయాల్లో కీలక పరిణామాలు సంభవిస్తున్నాయి. గత ఏడాది చివరిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బంపర్ మెజారిటీతో ఎన్డీయే కూటమి గెలిచింది. 243 సీట్లలో 200కి పైగా సీట్లను ఎన్డీయే కూటమి గెలుచుకుంది. విపక్షంలోకి వచ్చిన ఆర్జేడీకి 30కి అటు ఇటుగా సీట్లు మాత్రమే దక్కాయి. జస్ట్ అలా ప్రతిపక్ష హోదా అయితే దక్కింది కానీ ఆర్జేడీ పని అయిపోయింది అన్న మాట వినిపించింది. అయితే కేవలం నాలుగు నెలల తేడాలో ఆర్జేడీ లేచి కూర్చుకునేలా ఎన్డీయే నేతల నిర్ణయాలు ఉంటున్నాయని అంటున్నారు.

**మూడున్నర దశాబ్దాలుగా :**

బీహార్ లో జాతీయ పార్టీలకు గుర్తింపు అయితే లేదు, అవి మనుగడ సాగించాలి అంటే ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకోవాల్సిందే. వాటి జట్టు కట్టాల్సిందే. దశాబ్దాల తరబడి బీహార్ ని ఏలిన కాంగ్రెస్ 1989లో ఓటమి పాలు అయింది. అది లగాయితూ మళ్ళీ గట్టిగా యాభై సీట్లు ఎపుడూ గెలుచుకున్న దాఖలాలు లేవు. జూనియర్ పార్టనర్ గా కాంగ్రెస్ మిగిలిపోయింది. బీజేపీ విషయానికి వస్తే ఆ పార్టీ 2000 దాకా పెద్దగా పెర్ఫార్మ్ చేసింది లేదు. నితీష్ కుమార్ అనే బలమైన రాజకీయ నేత ఇమేజ్ తోనే బీజేపీ ఎదుగుతూ వస్తోంది. ఎంత చేసినా 243 సీట్లు ఉన్న సభలో బీజేపీ పూర్తి మెజారిటీకి ఎపుడూ చేరువ కాలేకపోతోంది.

**పోటీ వారి మధ్యనే :**

ఇక బీహార్ రాజకీయ ముఖ చిత్రం చూస్తే కనుక అవతల లాలూ ప్రసాద్ యాదవ్ ఇవతల నితీష్ కుమార్ ల మధ్యనే రాజకీయం మోహరించి ఉంది. లాలూ హవాను అడ్డుకున్న ఘనత కచ్చితంగా నితీష్ దే. బీహార్ ప్రజలు తమ బిడ్డగా నితీష్ ని భావిస్తారు, అందుకే ఆయన రెండు దశాబ్దాల పాటు సీఎం గా పని చేయగలిగారు. ఇక బీజేపీ కూడా నితీష్ నే నమ్ముకుని తన రాజకీయ ప్రాబల్యాన్ని పెంచుకుంది. జేడీయూలో కూడా నితీష్ వారసులు ఎవరూ లేరు. ఆర్జేడీలో లాలూ కుమారుడు బాగానే రాణిస్తున్నారు. నితీష్ కుమారుడు నిశాంత్ కుమార్ కి రాజకీయంగా ఇంకా అరంగేట్రం లేదు అన్నది గుర్తు చేస్తున్నారు.

**జేడీయూలో వ్యతిరేకత :**

ఇదిలా ఉంటే నితీష్ కుమార్ రాజ్యసభకు వెళ్లాలనుకోవడం పట్ల 85 మంది ఎమ్మెల్యేలు ఉన్న జేడీయూ పార్టీలో మెజారిటీ ఎమ్మెల్యేలు, మంత్రులు తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు. స్వయంగా వారికి నచ్చచెప్పేందుకు నితీష్ కుమార్ తన నివాసానికి పిలిపించి మీటింగ్ పెట్టారు. అయితే రాజ్యసభకు వెళ్ళొద్దు అని అనేక మంది నితీష్ కి సూచించారు. బీహార్ సీఎం గానే ఉంటూ పాలన చేయాలని కోరారు వారి మాటలను విన్న నితీష్ కుమార్ యాదవ్ తీవ్ర భావోద్వేగానికి గురు అయ్యారని అంటున్నారు.

**క్యాడర్ ఆగ్రహం :**

ఇక పాట్నాలో జేడీయూ క్యాడర్ అయితే నితీష్ సీఎం పదవికి రాజీనామా చేయాలనుకోవడం వెనక భారీ కుట్ర ఉందని మండిపడుతున్నారు. నితీష్ నే బీహార్ ముఖ్యమంత్రి అని వారు నినాదాలు చేస్తున్నారు. ఆయన సీఎం గా ఉండాలని పాట్నావ్యాప్తంగా పోస్టర్లు వేశారు. అదే సమయంలో బీజేపీ నేతల మీద జేడీయూ కార్యకర్తలు విరుచుకుపడుతున్నారు. దీంతో ఇబ్బందికరమైన వాతావరణం అయితే కనిపిస్తోంది అని అంటున్నారు.

**ఆర్జేడీ హాట్ కామెంట్స్ :**

బీహార్ సీఎం నితీష్ కుమార్ రాజ్యసభకు వెళ్ళడం మీద ఆర్జేడీ అధినేత తేజస్వి యాదవ్ సంచలన కామెంట్స్ చేశారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా ఉన్న ప్రాంతీయ పార్టీలను బీజేపీ లేకుండా చేస్తోంది అని ఆగ్రహం వ్యక్తం చేసారు. బీజేపీతో పొత్తు అంటే ఇదే పరిస్థితి ఉంటుందని మహారాష్ట్ర శివసేనను తమిళనాడులోని అన్నా డీఎంకేని అలాగే ఇతర పొత్తు పార్టీలను ఆయన ఉదహరించారు. ఇవన్నీ పక్కన పెడితే ఈ పరిణామాలు ఆర్జేడీకి వరంగా మారుతాయా అన్న చర్చకు తెర లేచింది. బీహార్ వారు తన ప్రాంతీయ నేతకే పగ్గాలు అందిస్తారు. ప్రాంతీయ పార్టీలకే వారు గత మూడున్నర దశాబ్దాలుగా ఓటేస్తూ వస్తున్నారు. నితీష్ లేని జేడీయూ సైతం ఎలా ముందుకు సాగుతుందో తెలియని నేపథ్యంలో ఆర్జేడీ పుంజుకుంటుందా అన్న విశ్లేషణలు అయితే వినిపిస్తున్నాయి.

# జెన్ జెడ్ : నేపాల్ లో ఎలా గెలిచింది? బంగ్లాలో ఎందుకు ఓడింది?

**హైదరాబాద్ పెన్ పవర్:** ఒకే రకమైన ఆగ్రహం.. ఒకే తరహా పోరాటం.. కానీ ఫలితాలు మాత్రం విభిన్నం! బంగ్లాదేశ్ వీధుల్లో గద్దెలను కూల్చిన 'జెన్ జెడ్' నినాదం ఎన్నికల బరిలో ఎందుకు విఫలమైంది? నేపాల్ యువత అదే నినాదంతో అధికార పీఠాన్ని ఎలా అధిష్టించింది? ఆసియా రాజకీయాల్లో మారుతున్న యువతరం ప్రస్థానంపై ప్రత్యేక విశ్లేషణ.

ప్రస్తుత ప్రపంచ రాజకీయాల్లో 'జెన్ జెడ్' ఒక శక్తివంతమైన రాజకీయ కార్యాచరణ శక్తిగా అవతరించింది. నిరుద్యోగం, అవినీతి, సామాజిక అసమానతలు.. ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా ఈ యువతరం గళమెత్తుతోంది. అయితే శ్రీలంక నుంచి మొదలై బంగ్లాదేశ్, నేపాల్ మీదుగా సాగిన ఈ 'యువ తరంగం' పర్యవసానాలు ఆయా దేశాల్లో విభిన్నంగా ఉన్నాయి. ఉద్యమం చేయడం వేరు.. ఆ ఉద్యమాన్ని రాజకీయ అధికారంగా మార్చుకోవడం వేరు అని ఈ రెండు దేశాల ఫలితాలు మనకు స్పష్టం చేస్తున్నాయి.




**బంగ్లాదేశ్.. ఉద్యమం నుంచి అధికారం వైపు అడుగుల్లో వైఫల్యం**

2024లో బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వ పతనానికి దారితీసిన 'జులై విప్లవం' చరిత్రలో నిలిచిపోయేది. కోటా వ్యవస్థకు వ్యతిరేకంగా మొదలై అవినీతి, మానవహక్కుల ఉల్లంఘనలపై ఉధృతమైన ఈ ఉద్యమం పాలకులను గద్దె దింపడంలో సఫలీకృతమైంది. ఈ ఉద్యమ సారథులు నహిద్ ఇస్లాం, హస్నాత్ అఫ్తాబ్, అబ్దుల్లా అఖ్తర్ వంటి విద్యార్థి నాయకులు 'నేషనల్ సిటిజన్ పార్టీ'ని స్థాపించి రాజకీయ అరంగేట్రం చేశారు. అయితే ఆ ఎన్నికల్లో వారు ఘోర పరాజయాన్ని ఎదుర్కొన్నారు.

**ఓటమికి కారణాలు**

రాజకీయ అనుభవలేమి ప్రధాన కారణం.. ఉద్యమ పోరాట పటిమ ఉన్నప్పటికీ క్షేత్రస్థాయి రాజకీయ వ్యూహాలు.. పరిపాలనాపరమైన పరిణతి లేకపోవడం ప్రధాన లోపంగా మారింది. విప్లవం తర్వాత కూడా అశాంతి కొనసాగడం, హింస పెరిగి హత్యలు జరగడం.. సామాన్య ప్రజలలో అభద్రతా భావాన్ని పెంచింది. హఠాత్తుగా పుట్టుకొచ్చిన పార్టీ కావడంతో ప్రజలు తమ భవిష్యత్తును వీరి చేతుల్లో పెట్టడానికి వెనకాడారు. అంతేకాకుండా మేనిఫెస్టోలో స్పష్టత లేకపోవడం, పార్టీలో అంతర్గత విభేదాలు అదనపు శాపాలుగా మారాయి.

**నేపాల్.. కళాత్మక రాజకీయాలతో సత్తా చాటిన జెన్ జెడ్**

బంగ్లాదేశ్‌కు భిన్నంగా నేపాల్‌లో జెన్ జెడ్ ఒక పరిణతి చెందిన రాజకీయ శైలిని ప్రదర్శించింది. సోషల్ మీడియాను కేవలం నిరసనకే కాకుండా నిర్మాణాత్మక రాజకీయ ప్రచారానికి వేదికగా మార్చుకుంది. ర్యాపర్ బాలెన్ షా నాయకత్వంలో యువత అద్భుతమైన వ్యూహాన్ని అమలు చేసింది.

**గెలుపునకు కీలకాంశాలు**

ప్రజా సమస్యలతో అనుసంధానించారు. కేవలం నినాదాలకే పరిమితం కాకుండా బాలెన్ షా కాఠ్‌మాండూ మేయర్‌గా రోడ్లు, చెత్త నిర్వహణ వంటి మౌలిక సమస్యలను పరిష్కరించి ప్రజల నమ్మకాన్ని గెలుచుకున్నారు. సోషల్ మీడియా వినియోగం ద్వారా పాటల ద్వారా అవినీతిపై గళమెత్తడం, ఆకర్షణీయమైన రీల్స్ ద్వారా యువతను ఏకం చేయడం వంటివి 'రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ' (ఆర్ ఎస్ పీ)కి ప్లస్ పాయింట్ అయ్యాయి. ఉద్యమ దశలోనే పీఎం పదవి వంటి ఆశలను తిరస్కరించి స్థానిక సంస్థల నుంచి రాజకీయ నైపుణ్యాన్ని పెంచుకోవడం, అంచెలంచెలుగా ఎదగడం వారి విజయ రహస్యం.

**బంగ్లాదేశ్ పాఠాలు.. నేపాల్ భవిష్యత్తు**

బంగ్లాదేశ్, నేపాల్ ఘటనలు ఒక ముఖ్యమైన పాఠాన్ని చెబుతున్నాయి. కేవలం ఆగ్రహంతో కూడిన ఉద్యమాలు ప్రభుత్వాలను కూల్చగలవు, కానీ సుస్థిరమైన పాలనను అందించలేవు. రాజకీయాల్లో గెలవాలంటే 'ఉడుకు రక్తం'తో పాటు 'చల్లని ఆలోచన', స్పష్టమైన ప్రణాళిక, క్షేత్రస్థాయి అనుభవం, ప్రజలకు భరోసా కల్పించగల సామర్థ్యం చాలా అవసరం. నేపాల్ యువత చూపిన చొరవ, క్రమశిక్షణతో కూడిన రాజకీయ ప్రయాణం రాబోయే కాలంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువతరానికి ఒక దిశానిర్దేశం చేస్తుంది అనడంలో సందేహం లేదు.

# ఒక్క విజయం... ఎన్ని రికార్డులో!

- న్యూజిలాండ్‌పై 96 పరుగుల భారీ విజయంతో టీ20 వరల్డ్ కప్ గెలిచిన భారత్
- టీ20 చరిత్రలో వరుసగా రెండుసార్లు టైటిల్ గెలిచిన తొలి జట్టుగా రికార్డు
- సొంతగడ్డపై వరల్డ్ కప్ గెలిచిన మొదటి ఆతిథ్య దేశంగా టీమిండియా చరిత్ర
- మొత్తం మూడుసార్లు టీ20 ప్రపంచకప్ గెలిచిన ఏకైక జట్టుగా అవతరణ
- టోర్నీ ఆసాంతం అద్భుత ప్రదర్శనతో 8 మ్యాచ్‌లలో 7 విజయాలు నమోదు



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజు ఇది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ఆదివారం జరిగిన ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్ పోరులో టీమిండియా అద్భుత విజయాన్ని నమోదు చేసింది. టైటిల్ పోరులో న్యూజిలాండ్‌ను 96 పరుగుల భారీ తేడాతో చిత్తుచేసిన భారత్, విశ్వవిజేతగా నిలిచింది. 2023లో ఇదే మైదానంలో ఎదురైన పరాజయాల తాలూకు చేదు జ్ఞాపకాలను చెరిపేస్తూ, లక్షలాది మంది అభిమానుల సాక్షిగా టీమిండియా విజయకేతనం ఎగురవేసింది. ఈ విజయంతో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం సంబరాలతో మార్మోగిపోయింది. సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని భారత జట్టు డిఫెండింగ్ ఛాంపియన్‌గానే కాకుండా, ఫేవరెట్‌గా బరిలోకి దిగి అంచనాలను నిజం చేసింది.

ఒకే విజయంతో మూడు రికార్డులు

ఈ ఫైనల్ మ్యాచ్‌లో గెలుపు ద్వారా టీమిండియా ఒకేసారి మూడు అరుదైన మైలురాళ్లను అధిగమించింది.

**1. టైటిల్‌ను నిలబెట్టుకున్న తొలి జట్టు:**

టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఇప్పటివరకు ఏ జట్టూ వరుసగా రెండుసార్లు కప్పు గెలవలేదు. 2024లో ఛాంపియన్‌గా నిలిచిన భారత్, ఇప్పుడు 2026లో కూడా టైటిల్ గెలిచి, టైటిల్‌ను డిఫెండ్ చేసుకున్న తొలి పురుషుల జట్టుగా రికార్డు సృష్టించింది. తద్వారా ఈ ఫార్మాట్‌లో తమకు తిరుగులేదని నిరూపించుకుంది.

**2. సొంతగడ్డపై గెలిచిన తొలి ఆతిథ్య జట్టు:**

టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఉన్న ఓ పెద్ద సెంటిమెంట్‌ను భారత్ బద్దలు కొట్టింది. 2007లో టోర్నీ ప్రారంభమైనప్పటి నుంచి ఏ ఆతిథ్య దేశం కూడా సొంతగడ్డపై కప్పు గెలవలేదు. దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, శ్రీలంక, ఆస్ట్రేలియా వంటి జట్లు ఆతిథ్యం ఇచ్చినా కప్పును ముద్దాడలేకపోయాయి. కానీ 10వ ఎడిషన్‌కు శ్రీలంకతో కలిసి ఆతిథ్యం ఇచ్చిన భారత్, సొంతగడ్డపై కప్పు గెలిచిన తొలి జట్టుగా చరిత్ర సృష్టించింది.

**3. మూడుసార్లు విశ్వవిజేతగా:**

ఈ విజయంతో టీ20 ఫార్మాట్‌లో అత్యధిక సార్లు వరల్డ్ కప్ గెలిచిన జట్టుగా భారత్ అగ్రస్థానంలో నిలిచింది. 2007లో ధోని సేన తొలి కప్పు గెలవగా, 2024లో రెండోసారి, ఇప్పుడు 2026లో మూడోసారి టైటిల్ సాధించి 'హ్యాట్రిక్' కొట్టింది. వెస్టిండీస్, ఇంగ్లండ్ చెరో రెండుసార్లు గెలవగా, భారత్ మూడు టైటిళ్లతో అందరికంటే ముందుంది.

**జైత్రయాత్ర సాగిందిలా...**

ఈ టోర్నీలో భారత జట్టు ప్రయాణం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. మొత్తం 8 మ్యాచ్‌లలో 7 విజయాలు సాధించి తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించింది. ఫిబ్రవరి 7న ముంబైలోని వాంఖడే స్టేడియంలో అమెరికాపై 29 పరుగుల గెలుపుతో భారత్ తమ వేటను ప్రారంభించింది. అనంతరం ఫిబ్రవరి 12న ఢిల్లీలో నమీబియాను 93 పరుగుల తేడాతో చిత్తు చేసింది. ఫిబ్రవరి 15న కొలంబో వేదికగా చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 61 పరుగుల భారీ విజయం సాధించి అభిమానులకు పండగ వాతావరణాన్ని తీసుకొచ్చింది. ఆ తర్వాత అహ్మదాబాద్‌లో నెదర్లాండ్స్‌పై 17 పరుగుల తేడాతో గెలిచింది.

అయితే, ఫిబ్రవరి 22న అహ్మదాబాద్‌లోనే దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో భారత్‌కు ఏకైక పరాజయం ఎదురైంది. కానీ ఈ ఓటమి నుంచి వెంటనే తేరుకున్న టీమిండియా, ఫిబ్రవరి 26న చెన్నైలో జింబాబ్వేపై 72 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. మార్చి 1న కోల్‌కతాలో వెస్టిండీస్‌పై 5 వికెట్ల తేడాతో గెలిచి సెమీస్‌కు దూసుకెళ్లింది. ఉత్కంఠభరితంగా సాగిన సెమీఫైనల్ పోరులో ఇంగ్లండ్‌పై 7 పరుగుల తేడాతో గెలిచి ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంది.

**అక్టోబర్ 2023 నుంచి తిరుగులేని ఫామ్**

టీమిండియా ఈ టోర్నీకి ముందు నుంచే అద్భుతమైన ఫామ్‌లో ఉంది. అక్టోబర్ 2023 నుంచి ఇప్పటివరకు ఆడిన గత 56 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఏకంగా 48 విజయాలు నమోదు చేయడం విశేషం. వరల్డ్ కప్‌కు ముందు న్యూజిలాండ్‌పై సిరీస్ గెలిచి పూర్తి ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగిన భారత్, ఫైనల్ పోరులో అదే జట్టును చిత్తుచేసి విశ్వవిజేతగా అవతరించింది. మూడుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన టీమిండియా, టీ20 క్రికెట్‌లో ఒక సామ్రాజ్యాన్ని స్థాపించిందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.?

## చరిత్ర తిరగరాసిన భారత్.. టీ20 ఫార్మాట్‌లోనే

# తొలి జట్టుగా నయా రికార్డ్




**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్-2026 విశ్వవిజేతగా భారత్ నిలిచింది. 2026, మార్చి 8న గుజరాత్?లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచులో న్యూజిలాండ్?ను 96 పరుగుల తేడాతో చిత్తు చేసింది. తొలుత బ్యాటింగ్.. ఆ తర్వాత బౌలింగ్?లో రాణించి ఫైనల్ పోరును ఏకపక్షంగా మార్చి వరుసగా రెండోసారి టీ20 వరల్డ్ కప్ కైవసం చేసుకుంది. ఓవరాల్?గా మూడుసార్లు (2007, 2024, 2026) టీ20 వరల్డ్ కప్?ను టీమిండియా ముద్దాడింది. ఈ విజయంతో టీమిండియా పలు రికార్డులు నమోదు చేసింది. టీ20 వరల్డ్ కప్?కు అతిథ్యం ఇచ్చి టైటిల్ గెలిచిన తొలి జట్టుగా భారత్ చరిత్ర సృష్టించింది. అలాగే.. వరుసగా రెండు సార్లు టీ20 వరల్డ్ కప్ గెలిచిన జట్టుగా కూడా ఇండియా రేర్ ఫీట్ నెలకొల్పింది. గుజరాత్?లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచులో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 255 పరుగుల భారీ స్కోర్ చేసింది. సంజు శాంసన్ (89), అభిషేక్ శర్మ (52), ఇషాన్ కిషన్ (54) రాణించారు. చివర్లో శివమ్ దూబే 8 బంతుల్లో 26 రన్స్ చేసి మెరుపు ఫినింగ్ ఇచ్చాడు. న్యూజిలాండ్ బౌలర్లలో నీషమ్ 3 వికెట్లు సాధించాడు. మ్యాట్ హెన్రీ, రచిన్ రవీంద్ర చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం 256 పరుగుల భారీ లక్ష్య ఛేధనకు దిగిన న్యూజిలాండ్ 19 ఓవర్లలో 159 పరుగులకే చాపచుట్టేసింది. ఆది నుంచి భారత బౌలర్లు బెంబేలెత్తించడంతో ఏ దశలోనూ న్యూజిలాండ్ ఛేధన వైపు సాగలేదు. న్యూజిలాండ్ బ్యాటర్లలో ఓపెనర్ సీఫెర్ట్ ఒక్కడే హాఫ్ సెంచరీతో (52) ప్రతిఘటించాడు. కెప్టెన్ మిచెల్ శాంట్నర్ 43 పోరాడాడు. మిలిగిన బ్యాటర్లంతా చేతులేత్తేయడంతో వరల్డ్ కప్?కు అడుగు దూరంలోనే న్యూజిలాండ్ బోల్తా కొట్టింది.

## ఫైనల్ లో భారత్ గెలవలేదన్నారు.. కట్ చేస్తే టిటైల్ కొట్టేసింది..

**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్ 2026 ఫైనల్‌లో టీమిండియా అద్భుత ప్రదర్శనతో ప్రపంచకప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఎన్నో అనుమానాలు, పాత రికార్డులు, అపోహలను పటాపంచలు చేస్తూ భారత్ మరోసారి ప్రపంచ క్రికెట్‌లో తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఫైనల్ మ్యాచ్ ఆదివారం జరగడంతో కొందరు అభిమానులు సందేహాలు వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో భారత్ గెలవలేదని, ఈసారి కూడా అదే జరుగుతుందని పేర్కొన్నారు. అంతేకాదు, అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో ఇండియాకు అచ్చిరాదని కూడా అన్నారు. టీ20 వరల్డ్ కప్ చరిత్రలో న్యూజిలాండ్‌పై భారత్ విజయాలు చాలా తక్కువగా ఉన్నాయనే గత రికార్డులను కూడా పలువురు గుర్తు చేశారు. కానీ ఈసారి టీమిండియా ఆ అనుమానాలన్నింటినీ తుడిచిపెట్టింది. బ్యాటింగ్‌లో భారత బ్యాటర్లు దూకుడుగా ఆడి 255 పరుగుల భారీ స్కోర్ చేశారు. అనంతరం బౌలింగ్‌లో క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ ప్రత్యర్థి జట్టును ఒత్తిడిలోకి నెట్టారు. ఫీల్డింగ్‌లో కూడా అద్భుతమైన క్యాచులు, ఫీల్డింగ్‌తో మ్యాచ్‌పై భారత్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ఇలా ఆల్రౌండ్ షోతో రాణించిన టీమిండియా ఈ విజయంతో మరోసారి విశ్వవిజేతగా అవతరించింది. భారత్ వరుసగా రెండోసారి విశ్వవిజేతగా నిలిచింది. 40 కోట్ల మంది భారతీయుల ఆశలను నిజం చేస్తూ సూర్యకుమార్ యాదవ్ సేన పొట్టికప్పును సొంతం చేసుకుంది. అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచ్ లో 96 పరుగుల తేడాతో

విజయం సాధించింది. అయితే టీమిండియా ఇప్పటి వరకు మహేంద్ర సింగ్ ధోని సారథ్యంలో 2007లో టీ20 వరల్డ్ కప్ ని తొలిసారి గెలవగా.. అనంతరం 2024లో రోహిత్ శర్మ ఆధ్వర్యంలో రెండోసారి సొంతం చేసుకోగా.. 2026లో సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో భారత జట్టు మూడోసారి విశ్వవిజేతనగా అవతరించింది.

# 'ఉస్తాద్' సర్ప్రైజ్ టీజ్.. పెర్ఫెక్ట్ కమర్షియల్ బొమ్మలా ఉందే!



అనసూయ భరద్వాజ్ వైబింగ్ హైపై దృష్టి సారించింది

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ ఉస్తాద్ భగత్ సింగ్ నుంచి తాజాగా విడుదలైన సర్ప్రైజ్ గ్లింప్స్.. అందరినీ ఆకట్టుకుంటోంది. స్టార్ డైరెక్టర్ హరీష్ శంకర్ తెరకెక్కిస్తున్న ఆ కమర్షియల్ ఎంటర్టైనర్ ఉగాది కానుకగా మార్చి 19వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో మేకర్స్ ట్రైలర్ కు ముందు చిన్న వీడియోను విడుదల చేసి సినిమాపై మరింత ఆసక్తి పెంచారు. ట్రైలర్ టీజ్ పేరుతో విడుదలైన ఆ గ్లింప్స్ లో పవన్ కళ్యాణ్ మాస్ స్టైల్‌లో కనిపిస్తూ అభిమానులను అలరిస్తున్నారు. బ్యాక్ గ్రౌండ్‌లో భగవద్గీత శ్లోకాలు వినిపిస్తుండగా పవన్ చెప్పిన డైలాగ్ అభిమానులకు ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. "ఇందాక విన్నది భగవద్గీత.. ఇది భగత్ గీత.. దమ్మున్నోడు దాటొచ్చు" అంటూ ఆయన చెప్పిన డైలాగ్ సోషల్ మీడియాలో ఫుల్ గా ఫ్యాన్స్ వైరల్ చేస్తున్నారు.సుమారు 43 సెకన్ల నిడివి ఉన్న ఉస్తాద్ భగత్ సింగ్ టీజ్‌లో పవన్ కళ్యాణ్ ను పలు లుక్స్ లో చూపించారు మేకర్స్. ముఖ్యంగా పోలీస్ ఆఫీసర్ గెటప్ లో ఆయన కనిపించడం ఆకట్టుకుంటోంది. లుంగీతో మాస్ స్టైల్, కౌబాయ్ క్యాప్ తో మరో స్టైలిష్ లుక్ లో కనిపిస్తూ ఆయన ఆకర్షించారు. యాక్షన్ సన్నివేశాలు సినిమాలో ఎక్కువ ఉండనున్నాయని మేకర్స్ హింట్ ఇచ్చారు.సినిమా పెర్ఫెక్ట్ కమర్షియల్ ఎంటర్టైనర్ గా రూపొందుతున్నట్లు టీజ్ చూస్తే క్లియర్ గా తెలుస్తోంది. హరీష్ శంకర్ తన స్టైల్ కు తగ్గట్లుగా పంచ్ డైలాగులు, మాస్ ఎలిమెంట్స్ తో సినిమాను తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది.




గతంలో పవన్ కళ్యాణ్ తో చేసిన గబ్బర్ సింగ్ విజయాన్ని గుర్తు చేసేలా.. మరోసారి అభిమానులను అలరించే విధంగా చిత్రం ఉండనుందని అర్థమవుతోంది. పవన్ కళ్యాణ్ స్టైలిష్ స్క్రీన్ ప్రెజెన్స్, కమాండింగ్ బాడీ లాంగ్వేజ్, మాస్ డైలాగులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. మొత్తానికి చిన్న గ్లింప్స్ తో మేకర్స్ సినిమాపై అంచనాలు పెంచేశారని చెప్పాలి. ఇది కేవలం చిన్న గ్లింప్స్ మాత్రమేనని, త్వరలో విడుదలయ్యే ట్రైలర్ తో మరిన్ని హోప్స్ పెరుగుతాయని మేకర్స్ చెబుతున్నారు.ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకోగా.. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. విడుదల తేదీ ముందుకు రావడంతో చిత్రబృందం పనులను వేగవంతం చేసింది. తాజాగా పవన్ కళ్యాణ్ డబ్బింగ్ ప్రారంభించారు. ట్రైలర్ టీజ్ కోసం ప్రత్యేకంగా ఆయనతో డబ్బింగ్ చెప్పించినట్లు తెలుస్తోంది. దేవిశ్రీప్రసాద్ పాటలు అందించగా, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ కోసం తమన్ రంగంలోకి దిగారు..

తాజాగా విడుదలైన టీజ్ లో తమన్ ఇచ్చిన బీజీఎం వినిపించింది. టైటిల్ కార్డ్ లో తమన్ స్కోర్ అని ప్రత్యేకంగా ప్రస్తావించారు. చిత్రంలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. పార్థిబన్, కేఎస్ రవికుమార్, రావు రమేష్, రాంకీ, కేజీఎఫ్ అవినాష్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని, రవి శంకర్ యలమంచిలి నిర్మిస్తున్నారు.



సౌత్ స్టార్ కేథరిన్ త్రెసా స్టైలిష్ ఫోటోషూట్‌తో తలదాచుకుంది

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At FLAT NO. 31, RAJEEV NAGAR, VISAKHA A COLONY, NEAR JAMATHOTA, KILLIPALEM PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. "PEN POWER" vide PRGI Registration No. "APTEL/25/A4918" Editor: GANTYADA APPARAO. e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. Editor GANTYADA APPARAO.e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965